Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 362 | కరీంనగర్ | శుక్రవారం 22 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## జాతీయ రహదారిపై కంటెయినర్‌లో మంటలు

**- మంటల ధాటికి 8 కొత్త కార్లు బుగ్గి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 21 : మెదక్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తూప్రాన్ సమీపంలో జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై ప్రయాణిస్తున్న కంటైనర్ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్‌కు వస్తున్నఈ కంటైనర్ లారీ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు

11 లో

## రామగుండం..అగ్నిగుండం

**- ఎండల తీవ్రతతో ప్రజల బెంబేలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే21 : రోహిణీ కార్తె ముందు రోళ్లు పగిలే ఎండలు కొట్టడం ప్రకృతి సహజ వైపరీత్యం. కానీ, ఈసారి కార్తెకు వారం రోజుల ముందు నుంచే ఎండలు ఉగ్ర రూపం దాల్చడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం అగ్ని గుండంగా తయారైంది. ఈ నేపథ్యంలో గురువారం రామగుండంలో ఎండ తీవ్రత ప్రమాద స్థాయిలో ఉందని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ హెచ్చరిక

11 లో



## దేశం కోసం ప్రాణాలర్పించిన
# మహానేత

**- సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్**

**- రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 21 : దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం

11 లో

### కార్మికులకు
# ప్రభుత్వం శుభవార్త



**- కనీస వేతనాలు అమలుకు నిర్ణయం**

**- కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం**

**- లబ్ధిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు**

**- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు**

**- కెటిఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు**

**- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 21 : కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి

11 లో

## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

**- కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక**

**- పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాళేశ్వరం, మే 21 : సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా,

11 లో

## బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

**- 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 21 : బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ పక్రియ లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందిం చారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాల యాల్లో పార్టీ ప్రధాన

11 లో

## కొనుగోలు కేంద్రాల్లో
# మరణమృదంగం

**- రైతులు పిట్టల్లా రాలుతున్నా ధాన్యం కొనరా**

**- ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడండి సిఎం గారు**

**- 23న జరిగే కేబినేట్ భేటీలో అయినా చర్చించండి**

**- సిఎం రేవంత్‌కు కెటిఆర్ బహిరంగ లేఖ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 21 : పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.కొనుగోలు కేంద్రాల్లో

11 లో

## ఎబోలా వైరస్ విజృంభణ

**- ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా**

**- ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, మే 21 :ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడిం చింది. కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు

11 లో

## ఇన్‌ఫ్లుయర్లు సామాజిక బాధ్యతతో తీసుకోవాలి

**- డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌పై చైతన్యం కల్పించాలి**

**- త్వరలో 'ప్రభాత భేరి' సామాజిక చైతన్య కార్యక్రమం**

**- ఉత్తమ టూరిజం క్రియేటర్లకు అవార్డులు, ప్రోత్సాహకాలు**

**- 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో మంత్రి జూపల్లి కృష్ణారావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 21 : 'పర్యాటక రంగం కేవలం విహార యాత్రలకే పరిమితం కాదు.. అది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, యువతకు ఉపాధికి, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌కు శక్తివంతమైన సాధనం' అని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. డిజిటల్ వేదికల ద్వారా తెలంగాణ ప్రకృతి అందాలు, చారిత్రక వైభవం, సంస్కృతి సంపదను ప్రపంచానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణను వేగవంతం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింద న్నారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా బేగంపేట టూరిజం ప్లాజాలో నిర్వహించిన 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇచ్చిన సలహాలు సూచనలు స్వీకరించి పర్యాటక రంగాన్ని మరింత మెరుగు పరుస్తామని చెప్తుతునే.. పర్యాటక ప్రమోషన్ తో పాటు ప్రజల్లో ముఖ్యంగా యువతలో సామాజిక స్పృహ కలిగించడానికి కృషి చేయాలని దిశానిర్దేశర చేశారు. పర్యాటక ప్రాంతాల ప్రోత్సాహంతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి

11 లో

## లోన్ రికవరీ ఆడగాలకు కళ్లెం

**- కొత్త నిబంధనలు ప్రతిపాదించిన ఆర్‌బిఐ**

**- కస్టమర్లను వేధించే చర్యలపై కఠిన ఆంక్షలు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 21 : రుణాలు తిరిగి చెల్లించని సందర్భంలో వాటిని వసూలు చేసే విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. లోన్ల రికవరీ పేరుతో కస్టమర్లను వేధించే బ్యాంకులకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. ఈమేరకు 'కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటిటీస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్' పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. దీనిపై మే 31 వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమలు చేయనుంది. వ్యక్తిగత, కారు, హోమ్‌లోన్

11 లో

## మణుగూరు-రామగుండం రైల్వే లైన్ కు ఆమోదం?

**- రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మాణం**

**- మారుమూల గిరిజన పల్లెలకు పట్టనున్న మహర్దశ**

**- రైల్వే ప్రాజెక్టులపై అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి చర్చ**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



న్యూఢిల్లీ, మే21 : తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరు-రామ

11 లో

## ఎంజేపి బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

**- విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన జరగాలి - 8 వ తరగతి నుండే నీట్, ఎంసెట్ తర్ఫీదు - 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు అభినందనలు - ఫలితాలు తక్కువగా వచ్చిన ప్రిన్సిపాల్ లకు హెచ్చరిక - పూలే గురుకుల పాఠశాలల ఫలితాలపై సమీక్షలో మంత్రి పొన్నం**

హైదరాబాద్, మే 21 :మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.




11 లో





# వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా ప్రారంభమైన కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలు

## - త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ - కంచి పీఠాధిపతి చేత పుష్కర స్నానాలకు శ్రీకారం

## - భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి/కాటారం, మే 21:దక్షిణ భారతదేశంలోనే అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి నదికి సంబంధించిన అత్యంత అరుదైన సరస్వతి అంత్య పుష్కరాలు గురువారం ఉదయం జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమంలో వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. గోదావరి, ప్రాణహిత నదులతో అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే పవిత్ర క్షేత్రంగా పేరుగాంచిన కాళేశ్వరం ఆధ్యాత్మిక కాంతులతో మారు మ్రోగింది. గురువారం ఉదయం 5.43 గంటలకు పుష్కరాల ప్రారంభ వేడుకలు లాంఛనంగా నిర్వహించారు. వేకువజామునే సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు, వేద ఆశీర్వచనాలు, హోమ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఇప్పటివరకు సంప్రదాయపరంగానే కొనసాగిన సరస్వతి అంత్య పుష్కరాలను ఈసారి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. గోదావరి పుష్కరాల సమయంలో నిర్మించిన వీఐపీ ఘాట్ సమీపంలోని సరస్వతి ఘాట్‌లో పుష్కర వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, ట్రేడింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సరస్వతి అంత్య పుష్కర మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేద పండితులు వేద మంత్రాలతో ఘాట్ ప్రాంతాన్ని మారుమ్రోగించారు. తదనంతరం స్వామీజీ శ్రీ కాళేశ్వర-ముక్తీశ్వర స్వామి, శ్రీ శుభానంద దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా నిరంతరం శ్రమించి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించి చదువుల తల్లి సరస్వతి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.




# ముగిసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరం

## - క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేసిన జీఎం లలిత్ కుమార్

## - మొబైల్స్ కు దూరంగా ఉండి, క్రీడల్లో రాణించాలని పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 21 : సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని ఆర్జీ-1 ఏరియా జీఎం లలిత్ కుమార్ బాలబాలికలకు పిలుపునిచ్చారు. సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నెల రోజులుగా నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరం గురువారం ఘనంగా ముగిసింది. ముగింపు వేడుకలకు జీఎం లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనితా లలిత్ కుమార్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసిన క్రీడాకారులకు ఉచితంగా టీ-షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రీడలు పిల్లల్లో క్రమశిక్షణ, పట్టుదల, పోటీ తత్వం పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. డిజిటల్ యుగంలో పిల్లలు సెల్‌ఫోన్‌లకే పరిమితం కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, కరాటే విభాగాల్లో అనుభవజ్ఞులైన కోచ్‌లు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సేవా జాయింట్ సెక్రటరీ పెరుమాళ్ల రజిత, సీనియర్ పీఓ హనుమంతరావు, వీరారెడ్డి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ హెచ్.రమేష్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సామల సత్యనారాయణ, కోచ్‌లు మొండయ్య, షబానా, వెంకటేష్, రవితేజ, అనిల్ కుమార్, నవీన్, వ్యాయామ ఉపాధ్యాయులు, బాలబాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

## పర్యాటక వారోత్సవాల్లో భాగంగా గోడపత్రిక ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




భద్రాద్రి-కొత్తగూడెం, మే 21 : ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో సహజ సిద్ధమైన అటవీ ప్రాంతాలు, జలాశయాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యావరణ పర్యాటక ప్రాంతాలు విస్తారంగా ఉన్నాయని తెలిపారు. కిన్నెరసాని, భద్రాచలం దేవస్థానం, తుమ్మలచెరువు, బెంగాలపాడు, పర్ణశాల వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సోషల్ మీడియా వేదికల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు వీడియోలు, ఫొటోలు, ప్రత్యేక కథనాల ద్వారా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రజలకు చేరవేయాలని సూచించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు చిన్న వ్యాపారులు, హస్తకళాకారులు, గిరిజన ఉత్పత్తుల విక్రేతలకు ఆదాయం పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల సహజ సౌందర్యం, ఆధ్యాత్మిక ప్రాధాన్యత, చారిత్రక విశేషాలను ఆకర్షణీయంగా ప్రజలకు చేరవేస్తే మరింత మంది పర్యాటకులు జిల్లాకు వచ్చే అవకాశముందని కలెక్టర్ తెలిపారు. డిజిటల్ వేదికలను యువత ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, ప్రకృతి సంరక్షణ, స్థానిక సంప్రదాయాలకు గౌరవం కల్పించేలా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యాటక వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశేషాలు, చారిత్రక ప్రాధాన్యత, సందర్శనీయ స్థలాల వివరాలతో రూపొందించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ, జిల్లా క్రీడా శాఖ అధికారి పరందామరెడ్డి, వివిధ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఉద్యోగులు సమయపాలన పాటించాలి

## - ఐడీఓసీ కలెక్టరేట్‌లో వివిధ శాఖలపై జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 21 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయంలోని వివిధ శాఖలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన, క్రమశిక్షణ, ప్రజలకు అందించే సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ జిల్లా విద్యాశాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ, పౌర సరఫరాల శాఖ, కార్మిక శాఖ, ఉపాధి కల్పన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి కార్యాలయంలో ఉద్యోగుల సీట్ల వద్దకు వెళ్లి విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న సీట్లపై స్పందించిన కలెక్టర్, సంబంధిత ఉద్యోగులు ఇంకా విధులకు ఎందుకు హాజరుకాలేదని అధికారులను ప్రశ్నించారు. సరైన కారణాలు లేకుండా ఆలస్యంగా కార్యాలయాలకు వస్తున్న సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ అంకిత్, అలాంటి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆ రోజు జీతంలో కోత విధించాలని అధికారులను ఆదేశించారు. హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఉద్యోగి ఉదయం 10:30 గంటలలోపు తప్పనిసరిగా కార్యాలయానికి హాజరుకావాలని స్పష్టం చేశారు. విధులకు వచ్చిన ప్రతి ఉద్యోగి హాజరు రిజిస్టర్‌లో తప్పనిసరిగా సంతకం చేయాలని సూచించారు. నిర్ణీత సమయానికి రాకపోవడం లేదా సంతకం చేయని వారిని గైర్హాజరుగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తారని, ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖలో అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన, క్రమశిక్షణ, పారదర్శకత పెంపొందించేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణతో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులకు కార్మికుల హాజరు పెంచాలి

## పనిస్థలాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 21 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న ఎంఐ ట్యాంక్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. గ్రామ శివారులో జరుగుతున్న పనుల వద్దకు వెళ్లిన కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పనిస్థలాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పని సమయంలో కార్మికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారి ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యాక్టివ్ జాబ్ కార్డుల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం 300 జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 146 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఉపాధి హామీ పనులపై గ్రామస్థులకు మరింత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను పెంచి గ్రామీణ కుటుంబాలకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ కార్డులను పరిశీలించిన కలెక్టర్ ఒక కుటుంబం నుంచి ఎంతమంది పనులకు వస్తున్నారు, పని దినాలు సక్రమంగా నమోదవుతున్నాయా అనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ప్రతి కార్మికుడి హాజరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని, ముఖ్యంగా నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సర్పంచ్ కంగాల అంజలి, డీఆర్‌డీఓ విద్యాచందన, తహసీల్దార్ శిరీష, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బక్రీద్ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

## - నాగారం అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




భద్రాద్రి-కొత్తగూడెం, మే 21 : రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. పండుగ సమయంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఇతర జిల్లాలు, రాష్ట్ర సరిహద్దుల నుంచి జరిగే అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది డ్రాగన్ లైట్లు, బ్యాటన్లు వెంట ఉంచుకోవడంతో పాటు రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించాలని సూచించారు. చెక్‌పోస్ట్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత పత్రాలను పరిశీలించాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్--100కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు.

# భద్రతతో లక్ష్యాల సాధనకు సమిష్టిగా కృషి చేయాలి

## కేటీకే-6 గనిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఎస్.కవీంద్ర



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 21: “యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ భద్రతా ప్రమాణాలు పాటించి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలి” అని భూపాలపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం ఎస్. కవీంద్ర పిలుపునిచ్చారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీ నుంచి సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాల కార్యక్రమంలో భాగంగా గురువారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6 ఇంక్లైన్ గనిలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్. కవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీనియర్ ఉద్యోగుల అనుభవాన్ని జూనియర్ ఉద్యోగులు నేర్చుకోవాలని, యంత్రాల్లో ఆయిల్ లీకేజీలు లేకుండా టెక్నీషియన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. టెక్నీషియన్లు యంత్రాలకు డాక్టర్లలాంటి వారని పేర్కొంటూ, చిన్న మరమ్మతులను కూడా వెంటనే పూర్తి చేసి యంత్రాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధనకు రూపొందించిన ప్రణాళికలపై సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలు, సలహాలు ఇవ్వగా అధికారులు వాటిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఐఈడీఎం) జ్యోతి, గ్రూప్ ఏజెంట్ ములుకుంట్ల తిరుపతి, ఏరియా ఇంజనీర్ రాజారావు, డీజీఎం (ఎఫ్‌అండ్ ఏ) రాజేశ్వర్, డీజీఎం (క్వాలిటీ) కృష్ణప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, గని మేనేజర్ అనుగ్రహ్ నారాయణ్, గ్రూప్ ఇంజనీర్ సారంగపాణి, సంక్షేమ అధికారి దీపా పొద్దార్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి జి.శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బి. మధుకర్ రెడ్డి, సీఎంఓఏఐ ప్రతినిధి అరుణ్ కుమార్‌తో పాటు వివిధ యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# జనగణన హౌస్ లిస్టింగ్‌లో ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## మార్గదర్శకాలు జారీ చేసిన డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలీకేర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




భద్రాద్రి-కొత్తగూడెం, మే 21 : జనగణన కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ బ్లాక్ (హెచ్‌ఎల్‌బి) ప్రక్రియలో ఖచ్చితత్వం అత్యంత కీలకమని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలీకేర్ పేర్కొన్నారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో నమోదవుతున్న పొరపాట్లు, వాటి సవరణ విధానం, ఫీల్డ్ స్థాయిలో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, చార్జ్ ఆఫీసర్లు, హెచ్‌ఎల్‌బి సిబ్బందితో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, మౌలిక సదుపాయాల నమోదు సమయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో సాధారణంగా జరుగుతున్న తప్పిదాలను వివరించి, వాటిని తక్షణమే సరిచేసే విధానంపై సూపర్‌వైజర్లు, చార్జ్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. నమోదైన వివరాలను పునఃపరిశీలించి డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని, నాణ్యమైన సమాచార సేకరణకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, సీపీఓ సంజీవరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాతతో పాటు సంబంధిత శాఖల చార్జ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి నాణ్యమైన సమాచార సేకరణకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.

# ఐఎండబ్ల్యూఎఫ్ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా మోట పలుకుల రమేష్

## - హర్షం వ్యక్తం చేసిన ఏఐటీయూసీ నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 21 : ఒడిశా రాష్ట్రంలోని పూరీ నగరంలో ఇటీవల ఘనంగా నిర్వహించిన ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎండబ్ల్యూఎఫ్) 14వ జాతీయ మహాసభల్లో భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం నుంచి భూపాలపల్లి బ్రాంచ్‌కు చెందిన నాయకుడు ఈ పదవికి ఎన్నిక కావడం పట్ల భూపాలపల్లి ఏఐటీయూసీ నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. సింగరేణి కార్మికుల సమస్యలపై నిత్యం పోరాడుతూ అనేక ఉద్యమాలు నిర్వహించిన నాయకుడిగా మోట పలుకుల రమేష్‌కు మంచి గుర్తింపు ఉందని నాయకులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరింత సమర్థవంతంగా పోరాటం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ మహాసభల్లో ఆసిఫ్ పాషా, కరీముల్లా, పి. శ్రీనివాస్, డి. శ్రీనివాస్, అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ పార్టీలో రామగుండం పట్టణ బిడ్డలకు గుర్తింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 16 : రామగుండం పట్టణంలో రాజకీయ రంగంలో సాధారణ క్రియాశీల పాత్ర నుంచి రాష్ట్రస్థాయిలో రామగుండం ప్రాంత సంఘటిత అసంఘటిత కార్మిక సంఘాల ప్రతినిధి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కౌశిక్ హరి, రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎదిగిన కోలేటి దామోదర్‌లకు బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో కీలక బాధ్యతలు అప్పగించడం పార్టీలో వారి సేవలకు గుర్తింపు ఇవ్వడం బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతన నూతనోత్సాహన్ని అందిస్తుంది. మంచిర్యాల నియోజక వర్గానికి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియ ఇంచార్జి బాధ్యతలను కౌశిక్ హరికి, అదేవిధంగా అంబార్‌పేట ఇన్చార్జిగా కోలేటి దామోదర్‌ను బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ప్రకటించడం పట్ల ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అభినందిస్తున్నారు. రామగుండం పట్టణ నేతలు ఇద్దరు బిఆర్ఎస్ పార్టీలో తగిన ప్రాధాన్యత దక్కడం పట్ల సర్వత్ర వారి అభిమానుల్లో హర్షం వ్యక్తమౌతోంది

# ప్రభుత్వం రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## - బిజెపి ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మార్వోకు వినతి పత్రం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 21 : రాష్ట్రంలో ధాన్యం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర జాప్యం మౌలిక వసతుల లేమి. తరుగు. తేమ పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టి యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ జగిత్యాల పట్టణ శాఖ అధ్యక్షులు కొక్కు గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆరుగాలం చెమటోడ్చి, కంటికి రెప్పలా కాపాడుకుంటూ పంట పండించిన రైతన్న పరిస్థితి రోజురోజుకి దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల చుట్టూ వారాలు తరబడి తిరుగుతూ రైతులు నరకయాతన అనుభవిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళిక లోపం కారణంగా అన్నదాతలు రోడ్డుపై కూర్చునే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు, గన్ని బ్యాగులు, హమాలీలు లారీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి, ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. తరుగు. తేమ. తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే దళారులపై, కొనుగోలులో అవకతవకలకు పాల్పడుతున్న అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చిన నెల రోజులు గడుస్తున్నా తినకపోవడం దురదృష్టకరమని. ఇకనైనా కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్. బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, పట్టణ ఉపాధ్యక్షులు ఇట్యాల రాము, గాదాసు రాజేందర్, ఠాగూర్ పవన్ సింగ్, కొప్పు భాస్కర్, కార్యదర్శి మేడిపల్లి పుష్ప రెడ్డి, మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు పిండేరు భానుప్రియ, మధురిమ, బిజెపి నాయకులు నారపాక అశోక్, కాసారాపు శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి పూదరి శ్రీనివాస్, దామోదర్, గోస్కుల గంగాధర్, తరాల మహేష్, సంఘ తిరుపతి, చేని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 21 : భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35,వ వర్ధంతిని కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అజీమ్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్యలు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ 40 ఏళ్ల వయస్సులోనే దేశ రాజకీయాల్లో చారిత్రాత్మకంగా 414 లోక్ సభ స్థానాలు గెలుచుకొని, భారీ ప్రజా ఆదరణను సొంతం చేసుకున్నారని కొనియాడారు. రాజకీయ కోణంలో కాకుండా దేశ ప్రగతి నిర్మాణానికి వినియోగించారని, ఇన్ఫోసిస్, విప్రో, టిసిఎస్ వంటి సంస్థలకు ప్రోత్సాహం అందించడంతో భారత ప్రపంచ స్థాయిలో ఎదిగిందని గుర్తు చేశారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్, బలోపేతం చేయడంతో సాంకేతిక ఎదుగుదలకు పునాదులు వేశారని, యువతకు నాణ్యమైన విద్యను అందించాలని రాజీవ్ గాంధీ ప్రత్యేకంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపనతో ఉన్నత విద్యను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి, ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉద్దేశంతో జవహర్ లాల్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించారని తెలిపారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా అనేక పేద మధ్యతరగతి విద్యార్థులు కూడిన నాణ్యమైన విద్యను పొందుతున్నారంటే దానికి కారణం ముందు చూపుగా రాజీవ్ గాంధీ చేసిన కృషి ముఖ్య కారణమని చెప్పొచ్చున్నారు. యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలనే ముఖ్య ఉద్దేశంతో ఇరవై ఒక్క సంవత్సరంలుగా వున్న ఓటును నుండి 18 సంవత్సరాల నుండే ఓటు హక్కును వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుంటూ రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేశారన్నారు. మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు రాజకీయంలో రాణించాలని ఉద్దేశంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బాటలు వేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు న్యావానంది శేఖర్, తక్కలపల్లి సర్పంచ్ రాజాగంగారం, కథలాపూర్ ఉప సర్పంచ్ చేటపెల్లి ప్రసాద్, మ్యాధారవేని రాజు, ఎండి ముబిన్, అంగ మహేష్, పిడుగు తిరుపతి రెడ్డి, రిక్కల తిరుపతి రెడ్డి, బాపురపు దేవేందర్, ఎండి మొయినోద్దీన్, అంగ మహేష్, ఎండి నసీర్, ఎండి మొయిద్దీన్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# వనపర్తిలో భరోసా కేంద్రం ప్రారంభం

## మహిళలు, చిన్నారులకు భద్రత-న్యాయ సహాయం ఒకేచోట అందించేలా ఏర్పాట్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 21 : వనపర్తి జిల్లాలో మహిళలు, చిన్నారులకు భద్రతతో పాటు మానసిక, న్యాయ పరమైన సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన "భరోసా కేంద్రం"ను ఉన్నతాధికారులు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐజీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. భరోసా కేంద్రం ద్వారా మహిళలు, బాలికలు, చిన్నారులపై జరిగే వేధింపులు, గృహ హింస, లైంగిక దాడుల కేసుల్లో బాధితులకు ఒకేచోట వైద్య, న్యాయ, కౌన్సెలింగ్ సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగకుండా సత్వర సహాయం అందించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.....మహిళల రక్షణకు తెలంగాణ పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ......సమాజంలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణకు అవగాహనతో పాటు కఠిన చర్యలు అవసరమన్నారు. భరోసా కేంద్రం బాధితుల్లో నమ్మకం పెంచే విధంగా పనిచేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ..... వనపర్తి జిల్లాలో మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు మరింత విస్తరిస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.....భరోసా కేంద్రంలో ప్రత్యేక కౌన్సెలర్లు, మహిళా పోలీసులు, న్యాయ సలహాదారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. బాధితులకు మానసిక ధైర్యం కల్పిస్తూ వేగంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా స్పోర్ట్స్ మీట్

## విజేతలకు కప్పులు అందజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి మే, 21 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లకు విజేతల కప్పులను అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి మొదటి బహుమతి సాధించిన పోలీస్ టీమ్‌కు, రెండో బహుమతి సాధించిన టీచర్స్ టీంకు ఛాంపియన్స్ కప్పులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ...,. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు జట్టు భావన, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. పోలీసులు ప్రజల భద్రత కోసం ఎంత కష్టపడుతున్నారో, క్రీడల్లోనూ అదే ఉత్సాహాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ మాట్లాడుతూ.... పోలీస్ శాఖలో విధులతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు సిబ్బందిలో ఉత్సాహాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ.... యువత క్రీడల వైపు మొగ్గుచూపాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ.....పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలతో అనుబంధాన్ని పెంపొందించేలా మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 21 : ప్రస్తుతం రైతులు పండించిన దాన్యం పాపన్నపేట మండల వ్యాప్తంగా పంట అంతా రోడ్లమీదనే పెట్టుకొని రైతులు నానా అవస్థలు పడుతున్నారనీ, రైతులు పండించిన పంటలను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలని కోరుతూ గురువారం రోజు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పాపన్నపేట తహసిల్దార్ సతీష్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగామండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఎంఎస్పీ ధరకు ధాన్యాన్ని కొనుకుంటూ గన్ని బ్యాగులు,సుతిలి ట్రాన్స్పోర్ట్ చార్జీలు గిడ్డంగుల చార్జీలు అన్ని రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం అసమర్ధ పాలన వల్ల అధికారులు ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్య వైఖరి రైతులు పండించిన పంటను అమ్ముకోలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి శాఖ రాష్ట్రవ్యాప్తంగా తహసిల్దార్ లకు మెమోరాండం ఇచ్చుటకు నిర్ణయించడంలో భాగంగా పాపన్నపేట మండల తాసిల్దార్ కు వినతి పత్రం సమర్పించా మని తెలిపారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ,మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతూ తక్షణం రైతులు పండించిన పంటను ఈవారం రోజుల వ్యవధిలో తరలించి రైతుకు సత్వర ఉపశమనం కలిగించినట్లయితే బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బీకొండా రాములు నేత,ప్రధాన కార్యదర్శిలు లక్ష్మణరావు,నాగభూషణం, మండల ఉపాధ్యక్షులు భాగేష్,మల్లేశం,మండల కార్యదర్శి వెంకట్,సుంకరి కిష్టయ్య,సాయిబాబా,ఓబిసి మోర్చా వడ్ల బాగేష్,బీజేవైఎం అధ్యక్షులు జగదీష్,మండల నాయకులు సంతోష్,శంకర్ గౌడ్,గోపాల్,సుధాకర్,రాజు, కోశాధికారులు డాక్టర్ రాజేందర్,చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో ఎస్‌వీ న్యూరో సర్జన్ హాస్పిటల్ ప్రారంభం

## - ప్రజలకు అందుబాటులో ఆధునిక న్యూరో వైద్య సేవలు

## - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా ఘన ప్రారంభోత్సవం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 21 : వనపర్తి పట్టణంలో ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించేం దుకు ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర ఎస్‌వీ న్యూరో సర్జన్ హాస్పిటల్‌ను స్థానిక ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. బుధవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆస్పత్రి సేవలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా న్యూరో సంబంధిత వ్యాధుల చికిత్స కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు. ఆస్పత్రిలో ఆధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మెదడు, నరాల సంబంధిత సమస్యలకు ప్రత్యేక చికిత్సలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు డా. వై. అశోక్ యాదవ్, డా.జి.వి.కే.ఆర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ ఆస్పత్రి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వామన్ గౌడ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్, జీజే శ్రీను మాజీ కౌన్సిలర్, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యేను ఆస్పత్రి యాజమాన్యం శాలువాతో సన్మానించింది.




# పైరవీలకే పరిమితమవుతున్న యూనియన్లు

## -టీజీబీకేఎస్ కన్వీనర్ కెంగర్ల మల్లయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని, మే 21: బాయిబాట కార్యక్రమంలో భాగంగా సింగరేణి ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌ను టీజీబీకేఎస్ కన్వీనర్ కెంగర్ల మల్లయ్య గురువారం సందర్శించారు. ఆ యూనియన్ నాయకులు కోరుకొప్పుల శ్యాం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాయిబాట కార్యక్రమంలో మల్లయ్యకు కార్మికులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి మల్లయ్య మాట్లాడుతూ ఒకప్పుడు వర్క్‌షాప్‌కు వస్తే కార్మికులతో కళకళలాడుతూ కనిపించేదని, ప్రస్తుతం కార్మికుల కళ్లల్లో ఆనందం కంటే భయం ఎక్కువగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ కొనసాగుతుందా లేదా అన్న అనిశ్చితితో కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల హక్కులు, కంపెనీ భవిష్యత్తు కోసం యూనియన్లు పోరాడాల్సిన అవసరం ఉందని, కానీ కొన్ని యూనియన్లు పైరవీలకే పరిమితమై కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికులు ఐక్యంగా ఉండి యాజమాన్య కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీబీకేఎస్ నాయకులు ముదిగిరి మల్లేష్, తాండ్ర సత్యనారాయణ, బోడ ఐలయ్య, రామగిరి విజయభాస్కర్, దొడ్ల సతీష్, నాగుల మోహన్‌రావు, చిగురుపెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ

## - టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి మే 21 : భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్కులో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని, యువతకు అవకాశాలు కల్పించడంలో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ , సాంకేతిక రంగ అభివృద్ధికి పునాది వేయడంలో రాజీవ్ గాంధీ చేసిన. కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు. తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రి లో నిర్మలా జగ్గారెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, సి డి సి చైర్మన్ గడిల రామ్ రెడ్డి,సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కూన సంతోష్, ప్రభు గౌడ్ , కౌన్సిలర్లు తోపాజి వీణ హరీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరా నిలిచిపోకుండా చూడాలి

## - డిసిపి రామ్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, మే 21 : రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో యూరియా బస్తాల అన్‌లోడింగ్ ప్రాంతాన్ని పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి గురువారం సందర్శించి అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో పాటు హమాలీలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలపై చర్చించారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణా కోసం అధిక సంఖ్యలో లారీలను వినియోగిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న యూరియా ఎరువుల రవాణాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారులు డిసిపికి వివరించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, వ్యవసాయ శాఖ తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాలకు చెందిన లారీ అసోసియేషన్ ప్రతినిధులతో డిసిపి సమావేశమై చర్చించారు. వరి, మొక్కజొన్న రవాణా ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగడంతో పాటు రైతులకు అవసరమైన యూరియా సరఫరా కూడా నిలిచిపోకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. యూరియా బస్తాల సరఫరా ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని తెలిపారు. అదేవిధంగా రైల్వే వ్యాగన్ల నుంచి యూరియా బస్తాలను లారీలలోకి ఎక్కిస్తున్న హమాలీల దాహార్తిని తీర్చేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చలివేంద్రాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై నరేష్, వివిధ శాఖల అధికారులు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, హమాలీలు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనకు సమిష్టి కృషి అవసరం

## - ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్

## - జీడీకే-11 గనిపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 21 : సింగరేణి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధనలో భాగంగా ఆర్జీ-1 ఏరియా పరిధిలోని జీడీకే-11 ఇంక్లైన్ గనిపై గురువారం మల్టీ డిపార్ట్‌మెం టల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, కార్మిక సంక్షేమం, భద్రతా ప్రమాణాలు, 2026-27 ప్రణాళికలు, మార్కెట్ సవాళ్లపై వివరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ ఎల్‌హెచ్‌డీ, ఎస్‌డీఎల్, కంటిన్యూస్ మైనర్ వంటి ఆధునిక యంత్రాలు ఉన్నప్పటికీ లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి ఉత్పత్తి రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. యంత్రాల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అవసరమైన పరికరాలు అందిస్తే పూర్తి స్థాయిలో పనిచేస్తా మని కార్మికులు తెలుపగా ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించిన జీఎం, వారి సమస్యలను తెలుసుకుని వారం రోజుల్లో అవసరమైన సామాగ్రి అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఏజీఎం ఐఈడీ ఆంజనేయులు, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, అధికారులు రాజన్న, బ్రహ్మాజీ రావు, శ్రావణ్ కుమార్, గని మేనేజర్ బి.మల్లేష్, ఫిట్ ఇంజనీర్ రాందాస్, సంక్షేమ అధికారి రవీందర్‌తో పాటు గని ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## రేవంత్ ఆలోచనకు తగ్గట్లుగా ఫ్యూచర్ సిటీ కదిలేనా ?

రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పనికూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయాలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమాలతో నెట్టుకు వస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా వేయడం వంటివన్నీ అభివృద్ది కిందకు రావు. ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలన పెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగ డానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లాగా ఇది అల్లుకుంటూ పోవడం వల్ల పెరిగందే తప్ప రాత్రికి రాత్రి పెరగలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది. అందువల్ల ఒక సిటీని కట్టాలంటే అనుకున్నం త ఈజీగా అమాంతంగా కట్టలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేదు. పోలవరం కట్టడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. నిధులు ఉండి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికా బద్దంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించడానికి లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కనుక ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యం అయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండంటే రెండేళ్ల కాలం మాత్రమే ఉంది. ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారుకలకు కూడా అర్థం కాదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాల న్నారు. పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగా ణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందిం చాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్-1 స్థాయి అధికారులను నియమించాల న్నారు. ఇవన్నీ బాగానే ఉన్నా, అక్కడ మౌలిక వసతులు, ముఖ్యంగా రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా, అందుకు కేంద్రం త్వరగా నిధులు విడుదల చేయాల్సి ఉం ది. 1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఫ్యూచర్ సిటీ దేనికి ప్రాధాన్యం అన్నది కూడా ముఖ్యమే. ఇప్పటికిప్పుడు అక్కడికి వెళ్లి ఉం డలేం. అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎవ్వరు కూడా ఉండలేరు. ఇది ఓరకంగా చెప్పాలంటే త్రిశంకు స్వర్గాన్ని సృష్టించడమే అవుతుంది. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బహుశా ఇదే ధీమాతో మరో పదేళ్లకు దీని గురించి ప్లాన్ వేసుకున్నారా అన్నది తెలియదు. ఒకవేళ సిఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మరోమారు గెలిపించక పోతే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటన్నది ప్రశ్నార్థకం. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎవరు సిఎం అన్నది అప్పుడే నిర్ణయిస్తారు. ఒక్క వైఎస్ విషయంలో మాత్రమే రెండో ఆలో చన లేకుండా ఆయనను సిఎం చేశారు. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించు కున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చు. అయితే తనకు తాను ఇలా ప్రకటించుకున్నా, పరిస్థితులు మన చేతుల్లో లేవు. తమిళనాడు, కేరళ, బెంగాల్ పరిస్థితులు చూశాం. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న విమర్శ ఉం ది. కాబట్టి నిర్మాణాత్మక వైఖరి అవసరం. అందుకు అనుగుణంగా కార్యాచరణ కావాలి. ప్రజల్లో ఇమేజ్ సంపాదించాలి. ఇవన్నీ చేసి, మళ్లీ అధికారంలోకి వస్తేనే ఫ్యూచర్ సిటీపై ప్రభావం ఉంటుంది. లేకుంటే ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో ఇది మనుగడలోకి రావడం ముమ్మాటికీ సాధ్యం కాకపోవచ్చు.

# దళిత జన బాంధవుడు భాగ్యరెడ్డి వర్మ

## మే 22... భాగ్యరెడ్డి వర్మ జయంతి



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

అంటరాని తనంపై ఆయన అలు పెరుగని పోరాటం చేశాడు. బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. జాతిపిత మహాత్మునిచే గౌరవింపబడినాడు. తాను నమ్మిన సత్యాలను అందరికీ తెలిపి సమాజంలో చైతన్యం తేవడానికి నిస్వార్థసేవ చేశాడు. దళిత స్త్రీల స్థాయిని దిగజార్చి, దేవాలయాల్లో దేవతలకు అంకితమైన అవివాహిత మహిళలు దేవదాసీలుగా, జోగినులుగా, పార్వతులుగా, జీవితాలను అంకితం చేసే జోగినీ వ్యవస్థ రద్దు, బాల్య వివాహాల వ్యతిరేకత, దళితులలో విద్యా వ్యాప్తి, అసమానత లేని సమాజం కోసం అవిశ్రాంత కృషి చేశాడు. మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందు వులం..' అని గర్వంగా చాటాడు. అంటరాని వారుగా దూరంగా ఉంచ బడిన వారిని "ఆది హిందువులు"గా భారత దేశంలో తొట్టతొలుత నివసించిన సంతతిగా ఆయన నొక్కి చెప్పాడు. నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో దళితో ద్యమానికి బాటలు వేసిన ఆ మహానేతనే భాగ్యరెడ్డి వర్మ. హరిజన పదం తెలంగా ణ ప్రాంతంలో వ్యాప్తిలో లేని కాలంలో ఆది హిందువు లుగా, ఆది ఆంధ్రులుగా, ఆది భారతీయులుగా నిమ్నవర్గ ప్రజలు తమను తాము ప్రకటించు కోవాలని కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు, మాడపాటి హనుమంతరావుల సహకారంతో భాగ్యరెడ్డి వర్మ ప్రచారం చేశాడు. భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ సంస్థానానికే పరిమితం కాక, తెలుగు నేలపై పలు ప్రాంతాలకూ విస్తరించాడు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిధిగా హాజరయ్యాడు.

దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22, 1888-ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్క ర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. హైదరాబాదు సంస్థా నంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్ర మండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరా బాదు ప్రాంతంలో సంఘ సంస్కర ణలకై కృషి చేశాడు.

మాదరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు 1888 సంవత్సరం, మే 22వ తేదీన జన్మించిన భాగ య్యకు, 1888 నవంబరులో వారి కుటుంబ గురువు భాగయ్యకు బదులు భాగ్యరెడ్డి అని నామ కరణం చేశాడు. ఆయన కుల శైవమత గురువు బోధనలు చేసేవారు.

ఆర్యులు హిందూ దేశానికి వలస రాకముందు, అస్పృశ్యులుగా సమాజంచే ముద్ర వేయబడిన ఆది హిందువులే పాలకులని గురువు వాదం. "రెడ్డి" అన్నది పాలకుడనే అర్థం గల "రేడు" అనే పదం నుంచి ఉద్భవించిందని, అందుచేతనే మాదిరి వెంకయ్యగారి భాగ్యయ్యకు రెడ్డిని జత చేశానని ఆయన చెప్పారు. ఆ తర్వాత 1913లో మాదిరి భాగ్యరెడ్డి హిందూ సమాజానికి చేసిన అపూర్వ సేవలకు గుర్తింపుగా ఆర్య సమాజ్ "వర్మ" అనే బిరుదు ప్రదానం చేశారు. ఆనాటి నుండి బాగయ్య భాగ్యరెడ్డిగా మారి, మాదిరి భాగ్యరెడ్డి వర్మగా, ఎం.వి. భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధికెక్కాడు. 1913లో 'ఆర్య సమాజ్' ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ప్రధానం చేశారు. దాంతో ఆయన భాగ్యరెడ్డి వర్మగా గుర్తింపు పొందాడు. భాగ్యరెడ్డి 1906లో షెడ్యూల్డు కులాల బాల బాలికల విద్య కోసం హైదరాబాదు లోని ఈసామియా బజారులో జగన్మిత్ర మండలిని స్థాపించాడు. హరిజనులలో విద్యావశ్యకతను గుర్తించి 1910లో జగన్మిత్ర మండలి ఆధ్వర్యంలో మొదటి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాడు.

భాగ్యరెడ్డి వర్మ అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్య సంఘాన్ని ఏర్పాటు చేసి, జగన్మిత్ర మండలి కార్యకలాపాలు మన్య సంఘం ద్వారా కొన సాగించాడు. మన్య సంఘం అంటరాని కులాల ప్రజల్లో చైతన్యం తీసుకు రావటానికి ప్రయత్నించింది. కొంతమంది ఉన్నత కులాల హిందువులు కూడా ఈ భజన మండళ్లను ప్రోత్సహించారు. మన్య సంఘం ఆధ్వర్యంలో ఈ భజన మండళ్లు రీడింగ్ రూములు ఏర్పరచి అందులో ఆంధ్రప్రత్రిక, దీనబంధు మొదలైన పత్రికలను అందుబాటులో ఉంచాయి.

ప్రదానంగా దళిత మహిళను, ఆ తర్వాత వెనకబడిన తరగతులకు చెందిన యువతులను ప్రత్యేకంగా దేవునికి అంకితమిచ్చే కార్యక్రమాలు నైజాం రాజ్యం లోని తెలంగాణ, మరట్వాడా, కన్నడ ప్రాంతాల్లో పురోహితులనబడే జంగాలు నిర్వహించేవారు. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి భాగ్యరెడ్డి వర్మ దూరదృష్టితో కార్యాచరణ చేపట్టాడు. ఆయన కృషివల్ల నిజాం దేవదాసి వ్యవస్థను నిర్మూలించాడు.

1917లో బెజవాడలో జరిగిన తొలి పంచమ మహా సభకు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించాడు. ఈ మహాసభలో ఆయన ప్రసంగానికి ప్రభావితులైన నిర్వాహకులు "ఆంధ్రదేశ తొలి ఆది ఆంధ్ర మహాసభ"గా పేరు మార్చారు. తర్వాత 1919లో బందరు లో, 1921లో ఏలూరు, భీమవరం, 1925లో అనంతపూర్, 1933లో నాగపూర్, 1938లో కాకినాడ తదితర చోట్ల జరిగిన ఆది ఆంధ్ర మహాసభలకు అధ్యక్షత వహించాడు. 1917లో విజయ వాడలో ఆంధ్ర పంచమ మహాజన సభలో, భాగ్యరెడ్డి వర్మ, ఏ హిందూ పురాణేతిహాసాల్లోనూ పంచము లనే పదం లేదని, ఈ ప్రాంతానికి మొట్ట మొదటి నుండి స్థానికులైన ప్రజలు పంచములే కాబట్టి, ఆది ఆంధ్రులనే వ్యవహారం సరైనదని తీర్మానించాడు. 1917 నుండి 1938 వరకు ఆది ఆంధ్ర మహా సభలు దాదాపు ప్రతి ఏటా జరిగాయి. అంటరాని వారిని ఆది హిందువులుగా పిలవాలని డిమాండు చేశారు. ఈ ఆది ఆంధ్ర మహాజన సభల ప్రభావంతో 1931 జనాభా లెక్కలలో మాల, మాదిగ, ధేర్, చమర్ లాంటి వారికి నిజాం ప్రభుత్వం ఆది హిందువులుగా పేర్కొన్నది. 1933 కల్లా ఆది - హిందూ సోషల్ సర్వీసు లీగు ఆధ్వర్యంలో 26 పాఠశాలలు ప్రారంభ మయ్యాయి. వీటిలో దాదాపు 2600 మంది విద్యార్థులకు చదువు చెప్పేవారు.

భాగ్యరెడ్డి వర్మకు హిందూమతంపై విశ్వాసం లేక మొదట్లో అర్య సమాజం, బ్రహ్మసమాజం బోధనలను పాటించేవాడు. తర్వాత బౌద్ధం పట్ల ఆకర్షితు డయ్యాడు. గౌతమ బుద్ధుడు ప్రవచించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ మొదలైన అంశాల పట్ల ఆకర్షితుడయ్యాడు. 1913 నుండి ప్రతి వైశాఖ పూర్ణిమ రోజున బుద్ధ జయంతిని జరుపు కొనే వాడు. తన ఏకైక కుమారునికి గౌతమ్ అని పేరు పెట్టుకున్నాడు.



1917 డిసెంబర్ 15వ తేదీన కలకత్తాలో మహాత్మా గాంధీ పాల్గొన్న "అఖిల భారత హిందూ సంస్కరణ మహాసభ"లో భాగ్యరెడ్డి వర్మ కూడా పాల్గొని, అనర్గళంగా, అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా చేసిన ప్రసంగం గాంధీజీని సైతం ఆకర్షించింది. మరునాట కలకత్తాలో మహాత్మా గాంధీ అధ్యక్షతన మరో సమావేశంలో పాల్గొనడానికి భాగ్య రెడ్డిని ఆహ్వానించి, వేదిక మీదకు తీసుకు రావడానికి తన ప్రైవేట్ కార్యదర్శిని పంపి, భాగ్యరెడ్డిని, గాంధీజీ తన ప్రక్కన కూర్చో బెట్టు కోవడాన్ని బట్టి ఆయన పట్ల గాంధీకి ఎంత గౌరవమో స్పష్ట మౌతున్నది.

భాగ్యరెడ్డి వర్మ దళితుల నుద్దేశించి...'దళితులే ఈ దేశపు మూల వాసులు. అవిద్య, అజ్ఞానం వల్ల మాత్రమే దళితులు వెనకబడి ఉన్నారు" అని ఆయన బోధించే వారట. దక్కన్‌లో భాగ్యరెడ్డి వర్మ నిర్మించిన ఆదిజన ఉద్యమం దేశవ్యాపితంగా నడిచిన ఆదిజన మూలవాసీ ఉద్యమానికి అనుసంధాన కర్తగా పనిచేసింది. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన భాగ్య నగర్ అనే పత్రికలో సాహిత్యంలో తొలిసారిగా తాను రాసిన నవల వెట్టి మాదిగ సాహిత్యాన్ని తానే తొలిసారి ప్రచురించాడు. అస్పృశ్యతా నివారణకు భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషికి, గుర్తిం పుగా హైదరాబాద్‌లోని ఇసామియా బజార్ ప్రధాన రోడ్‌కు 'భాగ్యరెడ్డి వర్మ మార్గ్' అని నగర పాలక సంస్థ దేశ స్వాతంత్ర్యాని కంటే ముందే నామకరణం చేయడం విశేషం. భాగ్య రెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో హైదరా బాదులో మరణించాడు.

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

## భానుడి భగభగ... బ్రతుకులు విలవిల

**- 45 నుండి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు**

**- గొడుగు సహాయంతో బయటకు వస్తున్న ప్రజలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖానాపూర్, మే 21 : భానుడి దగదగలతో ప్రజల బ్రతుకులు విలవిలలాడిపోతున్నాయి. తెలంగాణలోని చాలా ప్రాంతాలలో 45 నుండి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంటిలో ఉంటే ఉక్క పోత, ఇంటి బయటకు వస్తే సూర్యుడి మోత అన్నట్లు తయారైంది ప్రస్తుత వాతావరణం. ఇంటిలో ఉండలేక ఇంటి బయటకు రాలేక ప్రజలు సతమతమవుతున్నారు. కొందరు ఉదయాన్నే ఊరు బయట చెట్ల కిందికి, అడవిలోనికి వెళ్లి సేద తీరుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఎండలు మెండుగా ఉండడంతో, 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఏమి చేయాలో అర్థం కాక పిల్లలు, పెద్దలు అందరూ విలవిలలాడిపోతున్నారు. కొందరు బయటకు వెళ్ళేటప్పుడు గొడుగు తీసుకొని వెళుతున్నారు. ఉదయం సాయంత్రం తప్ప మధ్యాహ్న సమయంలో రోడ్లపైన ఒక్కరు కనిపించడం లేదు. చెట్లను నరికి వేయడం, కాలుష్యం అధికం కావడం వల్లనే ఇటువంటి పరిస్థితులు దాపురిస్తున్నాయని పలువురు అంటున్నారు. కోతుల కారణంగా చాలామంది ప్రజలు చెట్లను నరికి వేసినారు. చెట్లు పెడితే కోతులు వస్తాయనే భయంతో కొందరు చెట్లు పెట్టడం లేదు. చెట్లు లేకపోవడం వలన చల్లని గాలి ప్రజలకు అందడం లేదు. గతంలో ప్రతి ఇంటిలో కనీసం ఏదో ఒక చెట్టు ఉండేది. ప్రస్తుతం గల్లీకి ఒక చెట్టు కూడా లేకపోవడం విషాదకరం. చెట్లను పెంచకపోతే, ఉన్న చెట్లను నరుక్కుంటూ పోతే భవిష్యత్తులో ఉష్ణోగ్రతలు ఇంతకంటే ఎక్కువ పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ప్రభుత్వాలు కోతులను కట్టడి చేస్తే ప్రజలు చెట్లు పెంచడానికి ముందుకు వస్తారని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి చెట్లను విపరీతంగా పెంచాలని, చెట్ల పెంపకంలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. చెట్ల వల్ల కలిగే లాభాలను, అవి లేకుంటే వచ్చే నష్టాలను ప్రజలకు వివరించాలని కోరుతున్నారు. చెట్లు పెంచకుంటే భవిష్యత్తులో ప్రజలు భానుడి ప్రతాపానికి గురవుతారని హెచ్చరిస్తున్నారు.

## విదేశీ పర్యటన ముగించుకున్న ఢిల్లీకి ప్రధాని మోడీ

**విదేశీ ప్రతినిధులకు విలువైన కానుకలు అందచేత**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 21 : ప్రధాని నరేంద్ర మోదీ ఐదు దేశాల పర్యటనను ముగించుకుని గురువారం భారత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనల నేపథ్యంలో మోదీ ఆయా దేశాల నేతలకు భారత సంస్కృతి ఉట్టిపడేలా పలు కానుకలు అందజేశారు. ఇటలీ అధ్యక్షుడికి పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బలక్ష్మి పాటల సీడీలు కలిగిన మార్బుల్ ఇన్‌లే వర్క్ బాక్స్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అస్సాంలో ఫేమస్ అయిన ముగా సిల్క్ శాలువాను బహుకరించారు. తెల్లని పాలరాయితో తయారుచేసిన ఈ బాక్స్‌పై లాపిస్ లాజులి, టర్కోయిస్, మాలకైట్, పగడం వంటి రాళ్లను అలంకరించారు. ఈ పెట్టెలో లోపల భారత శాస్త్రీయ సంగీతంలోని ప్రముఖులైన పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బలక్ష్మి పాడిన పాటల సీడీలు ఉన్నాయి. ఇక, మెలోనీకి.. అస్సాంలో ' గోల్డెన్ సిల్క్'గా గుర్తింపుపొందిన ముగా సిల్క్ శాలువాను బహుమతిగా ఇచ్చారు. మణిపూర్‌కు చెందిన శిరుయ్ లిలీ సిల్క్ స్కార్ఫ్‌ను కూడా గిఫ్ట్‌గా ఇచ్చారు. నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌కి చేపల ఆకృతితో ఉన్న మధుబని పెయింటింగ్‌ను బహుమతిగా ప్రధాని మోదీ అందజేశారు. ఈ మధుబని పెయింటింగ్ అత్యంత ప్రాచీనమైనది. ఈ పెయింటింగ్ భౌగోళిక గుర్తింపు పొందింది. జానపద కళను ప్రతిబింబించే ఈ పెయింటింగ్‌లు.. భారత్, నేపాల్‌లోని మిథిలా ప్రాంతంలో ఉంటాయి.

పండగలు, వివాహాలు, ఆచార వ్యవహారాలు తదితర శుభకార్యాలకు సూచికగా ఈ పెయింటింగ్స్ వేస్తారు. ఈ మధుబని పెయింటింగ్స్‌కు సంబంధించిన మూలాలు భారతీయ పురాణాలు, జానపద కథల్లో ఉన్నాయి. పువ్వులు, పక్షులు, చెట్లు, చేపల వంటి ఆకృతుల ద్వారా దేవతలు, ప్రకృతితోపాటు రోజువారీ జీవిత దృశ్యాల ఈ పెయింటింగ్స్‌లో కనిపిస్తాయి. నెదర్లాండ్స్ ప్రధానికి ఈ కానుక ఇవ్వడం ద్వారా భారతీయ సంస్కృతి, ముఖ్యంగా మిథిలా కళారూపాన్ని పరిచయం చేసినట్లు అయిందనే చర్చ సాగుతోంది.

## సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ అమలు చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మే 21 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీంలో సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగులను మినహాయించడం హేయమైన చర్య అని తపస్ మెదక్ జిల్లా కార్యదర్శి మంగ నర్సింలు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల కోసం ప్రతిపాదించిన నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలులో సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రిటైర్డ్ ఉద్యోగుల పట్ల అవలంబిస్తున్న వివక్షను వ్యతిరేకించారు. ఉద్యోగంలో ఉన్నంత కాలం మూల వేతనం నుండి 1.5 శాతం నిధులను కట్ చేసుకుని క్యాష్‌లెస్ వైద్యం అందించి, రిటైర్ అయిన మరుక్షణమే హెల్త్ కార్డులు చెల్లవనడం ఏరకమైన న్యాయం? అని ఆయన ప్రశ్నించారు. ఎవరికైనా వృద్ధాప్యంలోనే వైద్యం అత్యంత అవసరమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులందరికీ నూతన హెల్త్ స్కీం కింద పూర్తి స్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందేలా జీవోలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

## భద్రతా మండలిలో మరోమారు పాక్ దుర్నీతి

**- గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి**

**- నరమేధం చేసే పాక్‌కు మాట్లాడే హక్కులేదని విమర్శలు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 21 : అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భం గా పాక్ ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్ పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ అమానుషమైన హింసాకాండలో 269 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 122 మంది గాయపడినట్లు తెలిపారు. 'చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు. తన సొంత ప్రజల పైనే బాంబులు వేస్తూ, జాతి నిర్మూలనకు పాల్పడే దేశం ఇలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడటంలో పెద్ద ఆశ్చర్యం కలిగించే విషయం కాదన్నారు.

# సింగరేణి అభ్యున్నతికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలి

## - ఆర్జీ-2 అఫీషియేట్ జీఎం మాలోత్ రాముడు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 21 : సింగరేణి సంస్థ అభ్యున్నతికి ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఆర్జీ-2 ఏరియా అఫీషియేట్ జీఎం మాలోత్ రాముడు అన్నారు. గురువారం ఆర్జీ-2 ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో జీఎం ఆఫీస్, నిమ్, ఎస్ఎంటీఎస్, ఎంవీటీసీ, సెక్టార్-3 డిస్పెన్సరీ అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మరవకూడదని సూచించారు. ప్రస్తుత కంపెనీ వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొని అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు బొగ్గు లభిస్తున్న నేపథ్యంలో సంస్థ ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యంత్రాల వినియోగం, పని గంటలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు సంస్థ ప్రస్తుత స్థితిగతులు, ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. గతంలో సాధించిన విజయాలు, ప్రస్తుతం నిర్దేశించిన లక్ష్యాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సంస్థ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యోగులు చేసిన సలహాలు, సూచనలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అరవింద రావు, ఏజీఎం ఐఈడీ చంద్రశేఖర్, డీజీఎం పర్చేస్ రామచంద్ర, డీజీఎం ఎస్ఎంటీఎస్ విజయ్ కుమార్, అడిషనల్ మేనేజర్ (క్వాలిటీ) సుభాష్, ఎంవీటీసీ మేనేజర్ సురేష్ బాబు, అకౌంట్ ఆఫీసర్ హిమవర్షతో పాటు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

## - వైద్యుల జాబితాను ప్రదర్శించాలి
## - ఫామ్-ఎఫ్ ఆన్లైన్ చేసి జిల్లా కార్యాలయంలో సమర్పించాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 21 : పట్టణంలోని దీప్తి హాస్పిటల్, పొనుగోటి హాస్పిటల్, వెన్నెల హాస్పిటల్, వీరభద్ర హాస్పిటల్స్ ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల ప్రయోజనార్థం ప్రతి సేవకు సంబంధించిన రుసుములు,అందుబాటులో ఉన్న సౌకర్యాలను స్థానిక భాషతో పాటు ఆంగ్ల భాషలో కూడా స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బయోమెడికల్, పొల్యూషన్, బి తదితర అవసరమైన లైసెన్సులను స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని తెలిపారు. కన్సల్టెంట్ వైద్యుల జాబితాను స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని అగ్నిమాపక శాఖ, పోలీస్, అత్యవసర సేవల మొబైల్ నంబర్లను సంస్థ ప్రాంగణంలో ప్రదర్శించాలని, సూచనల కోసం అవసరమైన సైన్ బోర్డులను ప్రదర్శించాలని, రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటిం చనట్లయితే ఏ సమయంలోనైనా రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని అన్నారు. స్కానింగ్ సెంటర్లలలో లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టు మాత్రమే గర్భవతులకు స్కానింగ్ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత ఆడ మగ అని తెలుపుట చట్టరీత్యా నేరమని, అన్ని స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేసే గదిలో వేచియుండు హాలులో తప్పకుండా ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు అనే బోర్డు పెట్టాల్సిందిగా ఆదేశించారు, ఫామ్ -ఎఫ్ ఏరోజువి ఆ రోజే ఆన్లైన్ చేసి ప్రతినెల 5వ తేదీ లోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రతి హాస్పిటల్ మేనేజ్మెంట్ వారు దరల పట్టికను ప్రదర్శించాలని, ఫైర్ సేఫ్టీ మెసర్స్ కు సంభందించిన పరికరాలను అమర్చుకోవాలని పేరుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జ్ పి ఓఎంహెచ్ఎన్ డాక్టర్ విరాజిత, లోక్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# రీల్స్‌తో మెదక్ పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 21 : ఇన్‌ఫ్లుయెన్సర్లు రీల్స్‌తో మెదక్ జిల్లా పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలని, లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లా టూరిజంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కాంపిటీషన్‌పై ఇన్‌ఫ్లుయెన్సర్లు,మీడియా ప్రతినిధులు,సోషల్ మీడియా హ్యాండ్లర్లతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. రీల్స్ కాంపిటీషన్ విధివిధానాలు,రిజిస్ట్రేషన్ ప్రక్రియ,బహుమతుల వివరాలు తదితర అంశాలను వారికి వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా మొదటిసారిగా వినూత్న పద్ధతిలో మెదక్ జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలకు బ్రాండింగ్ కలిగించే విధంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు.మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4ఖ వీడియో క్వాలిటీతో రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని, ఆసక్తి కలవారు తమ వీడియోలను మే 21వ తేదీ నుంచి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని,ఆన్‌లైన్ విధానంలో డీపీఆర్ఓ రాజు 9949922291, ఏపీఆర్ఓ బాబు 9701306838 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన నగదు ప్రోత్సాహకాలు అందించబడుతుందన్నారు. మెదక్ జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు,ప్రకృతి పర్యాటక కేంద్రాలు, జలపాతాలు,అభయారణ్య అందాలు,గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కలగలిసి అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి వైవిధ్యభరితంగా నెలవై ఉన్నాయని పేర్కొన్నారు.జూన్ మాసం నుంచి పర్యాటక ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని,వారందరికీ మెదక్ జిల్లా సాదర ఆహ్వానం పలుకుతుందన్నారు.రీల్స్ కాంపిటీషన్ ద్వారా మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలకు మంచి బ్రాండింగ్ వచ్చే విధంగా పూర్తి వివరాలతో, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలన్నారు. పర్యాటక దినోత్సవ టూరిస్ట్ గైడ్ పోస్టర్లు ఆవిష్కరించారు. టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు అట్టి దరఖాస్తులను నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి,డైరెక్టర్, పురావస్తు,మ్యూజియంల విభాగం డా.పి.నాగరాజు డిప్యూటీ డైరెక్టర్ (మ్యూజియంలు) ఎన్. నరసింగ్,డిప్యూటీ డైరెక్టర్ (ఇంజనీరింగ్) డిపిఆర్ఓ రామచంద్ర రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, పాత్రికేయులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు,యూట్యూబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలి

## - సిబ్బంది సంక్షేమం పట్ల జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉంటుంది
## - జిల్లా ఎస్పీ డా. శబరీష్
## - జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ దర్బార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 21: జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.శబరీష్ ఆధ్వర్యంలో ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందితో పోలీస్ దర్బార్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీ బందోబస్తు విధులు, ఎన్నికల డ్యూటీలు, ప్రజా భద్రత, ప్రత్యేక ఆపరేషన్లు, పండుగల సమయంలో నిర్వహించే భద్రతా బాధ్యతల్లో ఏఆర్ సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారని అభినందించారు. ఇదే క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు కొనసాగించాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ప్రతి పోలీస్ సిబ్బంది నిజాయితీతో పని చేయాలని, శాఖలో అవినీతికి ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా రాజీకి తావు ఉండదని హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ మార్గదర్శకాల మేరకు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం పట్ల జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, వసతి, డ్యూటీ సమయాలకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వేసవి కాలంలో విధులు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత నీరు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. శారీరక దారుఢ్యం కోసం ప్రతిరోజూ వ్యాయామం చేయాలని తెలిపారు. విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొంటూ, శాఖ ప్రతిష్టను పెంచే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, ఆర్ఐలు సోములు, భాస్కర్, అనిల్, నాగేశ్వరరావు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ శ్రీకారం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మే 21 : కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో బుధవారం పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ముందుగా పద్మశాలి పతాక ఆవిష్కరణ చేసి అనంతరం ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ అభివృద్ధి, సామాజిక సేవలో ముందడుగు వేసే సంకల్పంతో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం ఘనంగా చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు గుల్లపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వడ్నాల వెంకన్న, సంయుక్త కార్యదర్శి భోగ వెంకటేశం, కోశాధికారి కొక్కుల మురళి సహా కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంలో పద్మశాలి కుల బాంధవులు మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, పండితులు ఎనగంటి బిక్షపతిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా పద్మశాలి భవనంలో పతాకావిష్కరణతో ప్రారంభమై, ప్రమాణ స్వీకారం అనంతరం జ్యోతి ప్రజ్వలతో సాంప్రదాయ బద్ధంగా ప్రారంభం జరిగింది. అనంతరం సంఘ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు తమ బాధ్యతల స్వీకారం ఘనంగా చేశారు. పద్మశాలి సంఘం కుల పెద్దలు, మార్గదర్శకులు శ్రీ సిందం చంద్రయ్య మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు అంతా సమిష్టిగా ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సంఘంలో నిర్వహించే కార్యక్రమాలన్నీ కుల బాంధవులకు సమక్షంలో ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. నూతన అధ్యక్షుడు గుల్లపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వడ్నాల వెంకన్న లు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి కోసం కలసికట్టుగా పని చేయాలని, సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. సంఘం ఐక్యత మరియు సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని పలువురు పెద్దలు ఆకాంక్షించారు. ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం కార్యక్రమం వర్గ సభ్యులు కొంపల్లి సుదర్శన్,సుంక లింగమూర్తి, నూతి సుదర్శన్,మామిడాల రామకృష్ణ,వంగర మొగిలి, గాదె వెంకటయ్య,మార్త సత్యనారాయణ,కొప్పుల శంకర్, కొప్పుల సుధాకర్, బింగి వేణు, కొక్కుల సుదర్శన్,దండె భీమయ్య,గడదాసు శంకరయ్య, అల్లె గురువయ్య,వలపదాసు సోమేశ్వర్,మాచర్ల శ్రీనివాస్, మామిడాల మమత,పోన్న స్రవంతి,వలపదాసు శ్రీదేవి రమేష్,రాపల్లి సంతోష్ కుమార్, మాచర్ల సత్యనారాయణ,చేరాల శ్రీనివాస్,తౌటం చంద్రమౌళి,బూర సదయ్య,బైరి శ్రీనివాస్,చిక్కా రామలింగం,దాసరి తిరుపతి, ఆడేటి శంకర్,దండే లక్మణ్,వెంగల నాగేష్, సిరిమల్లె మదన్ మోహన్, వోల్లాల రవి కుమార్,ఆకుబత్తిని అశోక్,ఆకుబత్తిని చందర్, ఆకుబత్తిని విజయ్,చిక్క తరుణ్,కుల బంధువులు, పెద్దలు, యువత యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని నింపారు.





# రైతు రాజయ్య మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

## - మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 21 : రైతు రాజయ్య మృతి చెందడం చాలా బాధాకరమని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైతు రాజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ శంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామానికి చెందిన రైతు రాజయ్య వడ్లు కొనుగోలు కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న పద్మా దేవేందర్ రెడ్డి గురువారం మండల నాయకులతో కలిసి గ్రామానికి చేరుకొని రాజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. అనంతరం మెదక్ జిల్లా ఆస్పత్రి మార్చురీ గదిలో ఉన్న రాజయ్య మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వడ్లు కొనుగోలు కాకపోవడం, అప్పులు ఎలా తీర్చాలో తెలియక రాజయ్య తీవ్ర ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాజయ్య మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మెదక్ జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట శంకరంపేట మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి రాజు, నాయకులు ప్రభాకర్,పడాలశ్రీనివాస్, మల్లుపల్లి సర్పంచ్ నరేష్,తదితరులు ఉన్నారు.

# పోలీస్ సిబ్బందికి జిమ్ ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే 21 : తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది ఆరోగ్య దృఢత్వం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధునిక జిమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ ఎల్ చౌహాన్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తారని, వారి ఆరోగ్యం, ఫిట్‌నెస్ కూడా అంతే ముఖ్యమని అన్నారు. విధుల్లో ఒత్తిడిని తగ్గించుకోవడానికి మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి ఈ జిమ్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డీఐజీ ఎల్ చౌహాన్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని, ప్రతి పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండటం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధునిక పరికరాలతో కూడిన ఈ జిమ్ పోలీస్ సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉం టుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జడ్చర్ల, మే 21: జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబ్‌పేట్ మండలం కారూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, మహిళా సమైక్య భవనాలను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రజలకు ఈ భవనాలను అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా పరిపాలన అందించడంలో గ్రామపంచాయతీ భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని, మహిళా సమైక్య భవనాలు మహిళలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు స్వయం ఉపాధి కార్యకలాపాలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

## - రైతులకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
## - జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 21 : జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని కలికోట, అంబారి పేట, తాండ్రియాల, గంబీర్ పూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, డిసివో మనోజ్ కుమార్, తహసీల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా ప్రారంభమైన కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలు

**- త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ - కంచి పీఠాధిపతి చేత పుష్కర స్నానాలకు శ్రీకారం**
**- భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి/కాటారం, మే 21: దక్షిణ భారతదేశంలోనే అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి నదికి సంబంధించిన అత్యంత అరుదైన సరస్వతి అంత్య పుష్కరాలు గురువారం ఉదయం కాళేశ్వరం త్రివేణి సంగమంలో వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. గోదావరి, ప్రాణహిత నదులతో అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే పవిత్ర క్షేత్రంగా పేరుగాంచిన కాళేశ్వరం ఆధ్యాత్మిక కాంతులతో మారు మ్రోగింది. గురువారం ఉదయం 5.43 గంటలకు పుష్కరాల ప్రారంభ వేడుకలు లాంఛనంగా నిర్వహించారు. వేకువజామునే సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు, వేద ఆశీర్వచనాలు, హోమ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఇప్పటివరకు సంప్రదాయపరంగానే కొనసాగిన సరస్వతి అంత్య పుష్కరాలను ఈసారి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. గోదావరి పుష్కరాల సమయంలో నిర్మించిన వీఐపీ ఘాట్ సమీపంలోని సరస్వతి ఘాట్‌లో పుష్కర వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, ట్రేడింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సరస్వతి అంత్య పుష్కర మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం కంచి కామకోటి పీఠాధిపతి



శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేద పండితులు వేద మంత్రాలతో ఘాట్ ప్రాంతాన్ని మారుమ్రోగించారు. తదనంతరం స్వామీజీ శ్రీ కాళేశ్వర–ముక్తీశ్వర స్వామి, శ్రీ శుభానంద దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా నిరంతరం శ్రమించి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించి చదువుల తల్లి సరస్వతి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.



## కాళేశ్వర-ముక్తేశ్వర ఆలయ ప్రాంగణంలో ముమ్మర పారిశుద్ధ్య నిర్వహణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 21:జయశంకర్–భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలంలోని ప్రసిద్ధ కాళేశ్వర–ముక్తేశ్వర దేవస్థాన ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సరస్వతి నది అంత్య పుష్కరాల నేపథ్యంలో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో, వారి సౌకర్యార్థం పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రత కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఆలయ ప్రాంగణంలో చెత్త కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు తదితర వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలు, నది ఘాట్ ప్రాంతాలు శుభ్రంగా మెరిసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

## సరస్వతి పుష్కరాలకు విచ్చేసిన గవర్నర్‌కు ఘన స్వాగతం

**- పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించిన జిల్లా ఎస్పీ సంకీర్త్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 21:కాళేశ్వరం త్రివేణి సంగమంలో గురువారం ప్రారంభమైన సరస్వతి అంత్య పుష్కరాలకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఘన స్వాగతం పలికారు. పుష్కర వేడుకల్లో పాల్గొనేందుకు కాళేశ్వరానికి చేరుకున్న గవర్నర్‌కు ఎస్పీ సంకీర్త్ పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుష్కరాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులు గవర్నర్‌కు వివరాలు తెలియజేశారు. సరస్వతి అంత్య పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరం క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులతో పుష్కర ఘాట్‌లు కిటకిటలాడుతున్నాయి.

# ఐఎండబ్ల్యూఎఫ్‌లో కోల్ బెల్ట్ నాయకులకు కీలక పదవులు

**- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసిరెడ్డి సీతారామయ్య - జాయింట్ సెక్రటరీగా కొరిమి రాజ్‌కుమార్ ఎన్నిక**






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, మే 21:ఒడిశా రాష్ట్రం పూరీలో జరుగుతున్న 14వ ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎండబ్ల్యూఎఫ్) మహాసభల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్–ఏఐటీయూసీకి చెందిన కోల్ బెల్ట్ నాయకులకు కీలక బాధ్యతలు దక్కాయి. మహాసభ రెండో రోజు గురువారం జరిగిన సమావేశాల్లో ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసిరెడ్డి సీతారామయ్య, జాయింట్ సెక్రటరీగా కొరిమి రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. అలాగే జాతీయ కౌన్సిల్ సభ్యులుగా వంగ వెంకట్, జి.వీరస్వామి ఎన్నిక కావడం పట్ల కార్మిక ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని వివిధ గనుల ప్రాంతాల నుంచి హాజరైన కార్మిక నాయకులు, ప్రతినిధులు గనుల రంగ సమస్యలు, కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ గనుల కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంఘటిత పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్మికుల ఐక్యతే ఉద్యమాలకు ప్రధాన బలమని పేర్కొంటూ భవిష్యత్‌లో మరింత సమర్థవంతంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గనుల కార్మిక ఉద్యమాలకు ఈ మహాసభ కొత్త దిశానిర్దేశం చేస్తోందని, కార్మికుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.



## ఉపాధి హామీ కూలీలకు పెరుగు ప్యాకెట్లు, అరటిపండ్ల పంపిణీ

**రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతల సేవా కార్యక్రమం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 21:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధిలోని రామచంద్రునిపేట గ్రామపంచాయతీ కేంద్రంలో గురువారం మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశెట్టి ఖాదర్ బాబు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక పారికల వాగు చెరువులో పనులు నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీలకు పెరుగు ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమం నిర్వహించారు. కూలీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసం రవీందర్, మేకల వెంకన్న, తాళ్లపల్లి శ్రీహరి, అంతటి సంజీవరావు, ఈసాల చంద్రయ్య, కోరం రామారావు, సీనియర్ నాయకులు భూక్య సైదులు నాయక్, అన్నారపు రవికుమార్, బుర్ర ప్రభాకర్, చిలువేరు చంద్రశేఖర్, పొదెం సుధీర్‌తో పాటు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

**- ఎమ్మెల్యే కోరం కనకయ్య. కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**
**- 30 మంది లబ్ధిదారులకు రూ.30 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందజేత**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 21:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 30 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.30 లక్షల 3 వేల 480 విలువైన ఆర్థిక సహాయ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ కల్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాల ద్వారా ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని, ప్రజల జీవనోపాధి మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు కోరం సురేందర్, మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖాదర్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి–కొత్తగూడెం, మే 21:బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు గురువారం పార్టీ అధినేత కేసీఆర్ ఇంచార్జీలను ప్రకటించారు. ఈ క్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఇంచార్జ్‌గా నియమించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా నిర్వహిస్తూ, కార్యకర్తలను సమన్వయం చేయడంతో పాటు డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# బక్రీద్ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

**- సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు.**
**- మణుగూరు పోలీసు అధికారుల నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 21: రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. మణుగూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో గురువారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేలా పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు. అలాగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తూ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై



ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన తనిఖీలు ముమ్మరం చేసి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు నాగబాబు, అశోక్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు సురేష్, పి.వి.ఎన్. రావు, నగేష్, రాజేష్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కంప్యూటర్ యుగానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ : ఎమ్మెల్యే కోరం కనకయ్య

### - రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 21: భారతదేశంలో టెలికం విప్లవానికి, కంప్యూటర్ యుగానికి శ్రీకారం చుట్టిన దూరదృష్టి గల నాయకుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగ సవరణలు తీసుకువచ్చి స్థానిక సంస్థలకు మరింత అధికారాలు కల్పించారని తెలిపారు. దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, నియోజకవర్గ నాయకులు కోరం సురేందర్, ఈది గణేష్, రెడ్యానాయక్, పోశాలు, కాలే ప్రసాద్, లక్ష్మయ్య, రాందాస్, శివ, బానోత్ రవి, గణేష్, ఈశ్వర్, సంజయ్, సర్పంచులు కోరం సుభాష్ చంద్రబోస్, కోరం హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ వాష్ సెంటర్ ప్రారంభించిన కార్పొరేటర్ గుగులోత్ రాంబాబు

### - వాహనదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచన




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 21:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని నవభారత్ 32వ డివిజన్‌లో ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన "ఏ4 ఫోమ్ వాష్ & వాటర్ వాష్ సెంటర్"ను కార్పొరేటర్ గుగులోత్ రాంబాబు గురువారం ప్రారంభించారు. యజమాని ఎండీ అఫ్జల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సర్వీసింగ్ సెంటర్‌ను రాంబాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు నమ్మకమైన, నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. సర్వీసింగ్ సెంటర్ ఎల్లప్పుడూ వినియోగదారులకు అందుబాటులో ఉండేలా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి మారుతీరావు, 31వ డివిజన్ బీఆర్ఎస్ ఇంచార్జ్ డాబా శంకర్, 48వ డివిజన్ ఇంచార్జ్ సేవ్య, బీఆర్ఎస్ నాయకులు నవభారత్ ఆనంద్, అక్బర్ గాంధీ, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు వంకుడోత్ రమేష్, పండు, లాల్‌బాబు, వెంకటేష్, రాము, రవి, నవీన్, బీమా, యాకూబ్ పాషా, సురేష్, రమేష్, టైర్ల దుకాణ యజమాని నారా చలపతి, స్థానిక నాయకులు మోహన్, నయీమ్, రవి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 21:ఖమ్మం జిల్లా వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం మర్లపాడు సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి మాట్లాడుతూ దేశ సాంకేతికాభివృద్ధి, ఆధునికీకరణలో రాజీవ్ గాంధీ సేవలు విశేషమని కొనియాడారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించడంలో ఆయన దూరదృష్టి కీలకమైందని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, మర్లపాడు సర్పంచ్ కనుమాల ఆంధ్రయ్య, మాజీ సర్పంచ్ పావని శ్రీనివాసరెడ్డి, దాసరి కృష్ణారెడ్డి, కార్యదర్శి వంట్లాచంటి నడిపల్లి సతీష్, పుచ్చకాయల కాంతారెడ్డి, జగన్, కొండయ్య తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.నాయకులు రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పినపాక బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా దిండిగల రాజేందర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, మే 21:బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఇందులో భాగంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా దిండిగల రాజేందర్ మాట్లాడుతూ త్వరలోనే పండుగ వాతావరణంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ, కొత్త సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ కమిటీల ఎన్నికల షెడ్యూల్‌ను పార్టీ ప్రకటించనున్నదని చెప్పారు. నిర్ణయించిన గడువులో కమిటీల నియామక ప్రక్రియ పూర్తి చేసి, అనంతరం పార్టీ శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కొడవటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిత్య అన్నసత్రం

### - రేగొండ మండల అధ్యక్షుడి తణుకు రాజన్న సమక్షంలో నిర్ణయం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రేగొండ, మే 21:భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రెండో యాదాద్రిగా పేరుగాంచిన కొడవటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిత్య అన్నసత్రం ఏర్పాటు చేయాలని మండల అధ్యక్షుడు తణుకు రాజన్న అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా దేవస్థాన నూతన కమిటీని ఎన్నుకోగా, అధ్యక్షుడిగా తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాం రమేష్, కోశాధికారిగా నూకరాజును నియమించారు. జిల్లా అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి జిల్లా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై దేవస్థాన అభివృద్ధికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఎన్ఎస్ఆర్ సంపత్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తణుకు శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు అయితు రమేష్, ఉపాధ్యక్షులు బజ్జూరు రాఘవులు, రేపాక సదాశివుడు, మాడూరి ముక్తేశ్వర్, ఆకుల శ్రీనివాస్, హనుమకొండ జిల్లా కోశాధికారి శ్రీరాం రవీందర్, శ్రావణ్, రాజేష్ తదితరులతో పాటు భూపాలపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మణుగూరులో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

### - కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 21:మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో గురువారం ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మణుగూరు ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ ఆధునికీకరణ, సాంకేతిక రంగ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించిన దూరదృష్టి నాయకుడిగా ఆయనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీకి నివాళులర్పించారు.

# జూన్ 2 నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

### టేకులపల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, మే 21:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలో ఐటీడీఏ ద్వారా 1,500 ఇళ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. టేకులపల్లి మండల కేంద్రంలోని ఏ కాలనీ తండాకు చెందిన బానోత్ సునీత--రామ దంపతుల ఇందిరమ్మ ఇంటిని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను శాలువాలతో సన్మానించి స్వీట్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ జూన్ 2 నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇల్లందు నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసినట్లు తెలిపారు. అందులో 1,500 ఇళ్లను భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రస్తుతం వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇళ్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, నియోజకవర్గ నాయకుడు కోరం సురేందర్, హౌసింగ్ ఏఈ గణేష్, మండల నాయకుడు ఈది గణేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ మాల ఉద్యోగుల సంఘం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 21:తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మితో పాటు ఆరుగురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై తెలంగాణ మాల ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. మహిళలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ ఈ నియామకాలు చేపట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కేటీపీఎస్ ఉద్యోగి, తెలంగాణ మాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బూరుగు విజయభాస్కరరావు మాట్లాడుతూ మహిళా కమిషన్‌లో ఉద్యమ కుటుంబాలకు చెందిన మహిళలకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయమన్నారు. మంత్రి సీతక్క, మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ బలరాం నాయక్‌లకు కూడా సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. మహిళా కమిషన్ సభ్యులుగా శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవరెడ్డి, సదాలక్ష్మి, రాధీబాయి, ఉజ్మాషాయి షకీరా నియామకాలను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, మహిళలపై జరుగుతున్న అన్యాయాల నివారణలో కమిషన్ మరింత చురుకుగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గద్వాల విజయలక్ష్మిని శాలువాతో సత్కరించి స్వీట్లు అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే చిట్యాల శ్వేతకు కూడా స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎప్‌సెట్‌లో మెరిసిన సింగరేణి కార్మిక కుమార్తె అశ్విత

### - 716వ ర్యాంక్ సాధించిన అశ్వితకు టిబీజీకేఎస్ నేత నాగెల్లి అభినందనలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 21:ఇటీవల విడుదలైన ఎప్‌సెట్--2026 ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి ఏరియా వర్క్‌షాప్‌లో ఎలక్ట్రికల్ ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న గురు ప్రవీణ్ కుమార్ కుమార్తె బి. అశ్విత ఇంజినీరింగ్ విభాగంలో 716వ ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచింది. ఏజెన్సీ గిరిజన ప్రాంతమైన మణుగూరు నుంచి ఈ స్థాయి ర్యాంక్ సాధించడం స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. సామాన్య కార్మిక కుటుంబానికి చెందిన అశ్విత క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళికాబద్ధమైన చదువుతో ఈ విజయాన్ని అందుకుంది. పాఠశాల దశ నుంచే ఇంజినీరింగ్ రంగంలో రాణించాలని లక్ష్యంగా పెట్టుకుని అధ్యాపకుల సూచనలు, తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మణుగూరు ఏరియా టిబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు నాయకులతో కలిసి గురువారం అశ్విత నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి మిఠాయిలు అందజేసి ఆమె ప్రతిభను కొనియాడారు. సింగరేణి కార్మిక కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థిని ఇంత మంచి ర్యాంక్ సాధించడం ఏరియాకు గర్వకారణమని పేర్కొన్నారు. అశ్విత భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిబీజీకేఎస్ నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్ కుమార్, జంగం రాజ్‌కుమార్, మస్తాన్, ప్రవీణ్ కుమార్, కమటం పరమేష్, పీకే నాగరాజు, వర్క్‌షాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కుష్టు వ్యాధిగ్రస్తుల సేవలో సంధ్య సేవలు చిరస్మరణీయం

### - డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సంధ్యకు ఘన వీడ్కోలు
### - డీఎంహెచ్ఓ డా. తుకారాం రాథోడ్ ప్రశంసలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పీహెచ్‌సీ రేగళ్ల ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సంధ్యకు గురువారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై సంధ్య అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, సంధ్య లెప్రసీ విభాగంలో ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో పనిచేస్తూ విశిష్ట సేవలు అందించారని తెలిపారు. ముఖ్యంగా లెప్రసీ కేసుల గుర్తింపు, ఎల్‌సీడీసీ కార్యక్రమాలు, స్పర్శ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు, ప్రత్యేక కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు శిబిరాలను విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. సేవా కాలంలో అనేక మంది కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సరైన వైద్యం అందించడంతో పాటు వారిని సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో సంధ్య కీలక పాత్ర పోషించారని అభినందించారు. ప్రజల్లో కుష్టు వ్యాధిపై ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించడంలో ఆమె సేవలు ప్రశంసనీయమన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు సేవ చేయడం దైవ సేవతో సమానమని పలువురు వక్తలు పేర్కొంటూ సంధ్య సేవలను కొనియాడారు. సేవాభావం, మానవత్వం, బాధితుల పట్ల చూపిన ఆదరణ అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొని ప్రజలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సాయి కళ్యాణ్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ స్వప్న, డాక్టర్ హరీష్, డాక్టర్ రాకేష్ మోహన్ భద్రు, రాంప్రసాద్, నాగలక్ష్మి, సళిత, రామచంద్రుతో పాటు వైద్య అధికారులు, పీహెచ్‌సీ రేగళ్ల ఆరోగ్య సిబ్బంది, సహచర ఉద్యోగులు పాల్గొని సంధ్యకు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# సినిమా న్యూస్





## గోల్డ్ టాసెల్ గౌన్‌లో మెరిసిన రాశీ ఖన్నా!

తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న రాశీ ఖన్నా, సినిమాలతోనే కాకుండా ఓటీటీ ప్రపంచంలోనూ తన మార్క్ చూపిస్తోంది. గతంలో షాహిద్ కపూర్‌తో చేసిన 'ఫర్జీ' సిరీస్‌తో సూపర్ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు సరికొత్త యాక్షన్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా ఆమె నటించిన మోస్ట్ అవేటెడ్ క్రైమ్-థ్రిల్లర్ మ్యూజికల్ సిరీస్ 'లుక్కే' ప్రమోషన్స్‌లో రాశీ ఖన్నా ధరించిన గోల్డ్ టాసెల్ గౌన్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది..ఆ విశేషాలు చూద్దాం.. వెండితెరపై కమర్షియల్ సినిమాలతో పాటు మంచి పెర్ఫార్మెన్స్ ఉన్న రోల్స్ చేస్తూ రెండిటినీ బ్యాలెన్స్ చేసింది రాశీ ఖన్నా. అయితే డిజిటల్ స్క్రీన్‌పై కూడా ఆమె ట్రాక్ రికార్డ్ చాలా బాగుంది. 'ఫర్జీ' సక్సెస్ తర్వాత ఆమె డిమాండ్ ఓటీటీలో బాగా పెరిగింది. ఇప్పుడు మరోసారి అమెజాన్ ప్రైమ్ వీడియో ఒరిజినల్ సిరీస్ 'లుక్కే'తో డిజిటల్ ఆడియన్స్‌ను పలకరించింది.

ఈ సరికొత్త వెబ్ సిరీస్ 'లుక్కే'లో రాశీ ఖన్నా ఒక పవర్‌ఫుల్ పంజాబీ పోలీస్ ఆఫీసర్ 'ఇన్‌స్పెక్టర్ గుర్బానీ' పాత్రలో కనిపించనుంది. ఇక ఎప్పుడూ గ్లామరస్‌గా కనిపించే రాశీ, ఈ సిరీస్‌లో మాత్రం ఫుల్ యాక్షన్ మోడ్‌లో అదరగొట్టింది. డ్రగ్ మాఫియాను అంతం చేసే ఒక ఇంటెన్స్ రోల్‌లో ఆమె నటనకు మంచి మార్కులు పడుతున్నాయి.

హిమాంక్ గౌర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ 8 ఎపిసోడ్ల సిరీస్ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో మే 8 నుంచి సక్సెస్‌ఫుల్‌గా స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో రాశీ ఖన్నాతో పాటు ప్రముఖ రేపర్ కింగ్ , పాలక్ తివారీ, లక్ష్వీర్ సింగ్ సరన్, శివాంకిత్ పరిహార్ కీలక పాత్రలు పోషించారు. రాప్ మ్యూజిక్, క్రైమ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ థ్రిల్లర్ సిరీస్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది.సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా రాశీ ఖన్నా చేసిన ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నె ట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. స్టేజ్ పెర్ఫార్మెన్స్‌లకు తగ్గట్టుగా డిజైన్ చేసిన లగ్జరీ గోల్డ్ అంబ్రే నెట్ బాడీకాన్ గౌన్‌లో రాశీ మెరిసిపోయింది. ఇక ఈ కా స్ట్యూమ్‌కు ఉన్న పూసల లేయర్స్, ఓంబ్రే-టోన్డ్ టాసెల్స్ ఆమె అందాన్ని మరింత పెంచేశాయి. ఈ లుక్‌ను చూసిన అమెజాన్ ప్రైమ్ అఫీషియల్ సోషల్ మీడియా హ్యాండిల్ "హియర్స్ ఏ స్టన్నర్ టు క్లెన్స్ యువర్ ఫీడ్" అంటూ రాశీ ఫొటోలను షేర్ చేసింది. ఒకవైపు సిరీస్‌లో రఫ్‌గా ఉండే పోలీస్ పాత్రలో కనిపిస్తూనే.. బయట ప్రమోషన్స్‌లో మాత్రం ఇలాంటి అదిరిపోయే గ్లామరస్ ఫోటోషూట్స్‌తో 'లుక్కే' సిరీస్‌కు రాశీ ఖన్నా గట్టి హైప్ తీసుకొచ్చింది. క్యూట్ లుక్స్‌తో కెరీర్ స్టార్ట్ చేసిన రాశీ.. ఇప్పుడు ఇలాంటి ఇంటెన్స్ రోల్స్ చేస్తూ ఓటీటీ క్వీన్‌గా దూసుకుపోవడం నిజంగా గ్రేట్ అంటున్నారు ఫాన్స్.

## పెద్ది అసలు హైలైట్ చెప్పిన చరణ్!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ మల్టీ స్పోర్ట్స్ డ్రామా పెద్దిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గ్రామీణ బ్యాక్‌డ్రాప్, స్పోర్ట్స్ ఎలిమెంట్స్, ఎమోషనల్ స్టోరీలైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఫ్యాన్స్ లో ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. ముఖ్యంగా రీసెంట్ గా రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్, చరణ్ లుక్, మాస్ టోన్ సినిమాకు మరింత హైప్ తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా రామ్ చరణ్ చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో కొత్త చర్చకు దారి తీశాయి. డైరెక్టర్ బుచ్చిబాబుతో కలిసి స్పెషల్ డ్రైవ్ ఇంటర్వ్యూలో పాల్గొన్న చరణ్, పెద్ది సినిమాలో తనకు అత్యంత ఇష్టమైన భాగం ఢిల్లీ ఎపిసోడ్ అని చెప్పడం అభిమానుల్లో క్యూరియాసిటీని పెంచేసింది. ఆ ఎపిసోడ్ నుంచే నుంచే సినిమా నెక్స్ట్ లెవెల్‌కు వెళ్తుందని, అదే అసలు మెయిన్ పాయింట్ అని చరణ్ చెప్పడంతో ఫ్యాన్స్ తెగ ఎగ్జైట్ అయిపోతున్నారు. సాధారణంగా స్టార్ హీరోలు సినిమాపై హైప్ పెంచేలా కామెంట్స్ చేయడం కొత్తేమీ కాదు. కానీ చరణ్ ఈసారి ప్రత్యేకంగా ఒక ఎపిసోడ్‌ను మాత్రమే హైలైట్ చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమైంది.

ఇప్పటికే పెద్దిలో ఢిల్లీ ట్రాక్‌కు భారీ స్థాయి ఎమోషనల్ వెయిట్ ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పుడదే ట్రాక్ తన ఫేవరెట్ అని చరణ్ చెప్పడంతో అది సినిమాకు అసలు టర్నింగ్ పాయింట్ అయి ఉండొచ్చనే అంచనాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా ఇంటర్వెల్ తర్వాత కథ పూర్తిగా మారిపోతుందని, ఆ ఎపిసోడ్ హీరో జీవితాన్ని మార్చేస్తుందని ఊహాగానాలు ఆల్రెడీ సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి. మరో ఇంట్రెస్టింగ్ అంశం ఏంటంటే పెద్దిని ఇప్పటివరకు చాలా మంది కేవలం స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ఉన్న మాస్ సినిమా గానే భావించారు. కానీ చరణ్ కామెంట్స్ తర్వాత ఇది ఒక భారీ ఎమోషనల్ జర్నీ కూడా అవుతుందనే అభిప్రాయం బలపడుతోంది. ఒకవైపు గ్రామీణ నేపథ్యంలో సాగిన కథ అకస్మాత్తుగా ఢిల్లీకి షిఫ్ట్ అవ్వడం కూడా సినిమాకు పాన్ ఇండియా ఫీల్ తీసుకురావచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఇప్పటికే మంచి హైప్ ఉన్న ఢిల్లీ ట్రాక్‌పై రామ్ చరణ్ చేసిన తాజా కామెంట్స్ సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్లాయి. ఇక చరణ్‌ను అంతగా కదిలించిన ఆ ఎపిసోడ్‌లో ఏముందో తెలుసుకోవాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

## విదేశాలలో రైడ్ చేస్తూ సెగలు పుట్టిస్తున్న కృతి సనన్!



ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ ప్రస్తుతం తన సినిమా షూటింగ్లో బిజీగా గడుపుతూనే మరొకవైపు అక్కడి అందాలను తిలకిస్తూ ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంటుంది . అందులో భాగంగానే తాజాగా ఈమె నటిస్తున్న చిత్రం కాక్ టెయిల్ 2..2012లో వచ్చిన కాక్ టెయిల్ చిత్రానికి సీక్వెల్ గా వస్తున్న ఈ సినిమాలో షాహిద్ కపూర్ హీరోగా నటిస్తూ ఉండగా.. ప్రముఖ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న మరో హీరోయిన్గా నటిస్తోంది. హోమీ అడజానియా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఇటలీ లోని సిసిలీ ప్రాంతంలో జరుగుతోంది.

ఈ నేపథ్యంలోనే అక్కడి ప్రదేశాలను ఆస్వాదిస్తూ.. జీప్ లో ఎండలో సేద తీరుతున్నట్లు అక్కడి ఫోటోలను వీడియోలను అభిమానులతో పంచుకుంది. ముఖ్యంగా మల్టీకలర్ బికినీతో పాటు ఐవరీ ఫ్రింజ్డ్ షార్ట్స్ ధరించిన ఈమె .. తన గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. మొత్తానికైతే ఒకవైపు సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే.. మరొకవైపు కాస్త సమయం దొరికితే చాలు అక్కడ ఇటలీ వీధుల్లో కూడా విహరిస్తూ ఆ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసింది. ఏది ఏమైనా కృతి సనన్ రెండు వైపులా అన్నింటిని బ్యాలెన్స్ చేస్తూ మరింత సంతోషంగా కనిపిస్తోందని ఈ ఫోటోలు చూసిన నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.

1990 జూలై 27న ఢిల్లీలో జన్మించిన ఈమె.. మోడల్గా తన కెరీర్ను ప్రారంభించింది . ముఖ్యంగా కమర్షియల్ యాడ్స్ లో కనిపించి బాలీవుడ్లో భారీ పాపులారిటీ అందుకున్న కృతి.. తొలిసారి సుకుమార్ దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా వచ్చిన వన్ నేనొక్కడినే సినిమాతో అరంగేట్రం చేసింది. హిందీలో జాకీ ష్రాఫ్ తనయుడు టైగర్ ష్రాఫ్ సరసన హీరో పంతి సినిమాతో హిందీ రంగ ప్రవేశం చేసింది ఈ ముద్దుగుమ్మ. ఇక తర్వాత ప్రభాస్ హీరోగా నటించిన ఆది పురుష్ హిందీ చిత్రంలో సీతగా నటించింది కానీ ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోలేకపోయింది.

ఇకపోతే 2021 లో వచ్చిన మిమీ అనే సినిమాతో ఉత్తమ నటిగా ఫిలింఫేర్ అవార్డు , జాతీయ చలన చిత్ర అవార్డు అందుకున్న ఈమె.. 2019లో ఫోర్బ్స్ ఇండియా సెలబ్రిటీ 100 జాబితాలో పేరు దక్కించుకొని అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇక ప్రస్తుతం హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కృతి సనన్ గత ఏడాది ధనుష్ హీరోగా నటించిన తేరే ఇష్క్ మే అనే చిత్రంలో నటించింది. ఈ చిత్రాన్ని తెలుగులో అమర కావ్యం పేరిట రిలీజ్ చేశారు. ఇక ప్రస్తుతం కాక్ టెయిల్ 2 సినిమా షూటింగ్లో బిజీగా ఉంది. అలాగే అభిమానులను అలరించడానికి నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలను పంచుకుంటున్న విషయం తెలిసిందే.

# ఆరోగ్యం



## మీ మూత్రం ఏ రంగులో ఉందో గమనించారా?..

## ఈ రంగుల్లో ఉంటే మాత్రం కచ్చితంగా రోగం ఉన్నట్లే!

మన శరీరంలో ఏదైనా సమస్య ఉంటే మూత్ర పరీక్ష ద్వారా తెలుసుకుంటాం కదా. అయితే పరీక్ష లేకుండానే మన మూత్రం రంగును బట్టి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవచ్చు. మూత్రం సాధారణంగా కాకుండా వేరే రంగులో ఉంటే కచ్చితంగా మనం ఎదో సమస్యలో ఉన్నామని అర్థం చేసుకోవాలి. మూత్రం ఏ రంగులో ఉంటే ఎలాంటి సమస్యలు వస్తాయనేది ఈ స్టోరీ ద్వారా తెలుసుకోండి.

ఎరుపు లేదా పింక్ కలర్

మూత్రం ఎరుపు లేదా గులాబీ రంగులో ఉంటే కిడ్నీ పాడైందని అర్థం. పింక్ యూరిన్ చూసిన వెంటనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మూత్రం సాధారణంగా అదే కలర్‌లో కనిపిస్తుంటుంది. ఏదైనా ఆహారం తిన్నా, లేదా మందులు వేసుకున్నా మూత్రం పింక్ కలర్‌లో మారుతుంటుంది. అందుకే మీ మూత్రం పింక్ కలర్‌లో కనిపించగానే మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు. ఒకవేళ మీరు ఎలాంటి ఆహారం తీసుకోకపోయినా, మీ మూత్రం అదే రంగులో కనిపిస్తే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించండి.

మూత్రం గోధుమ రంగులో ఉంటే.. మీ మూత్రం గోధుమ రంగులో ఉంటే, మీరు డీహైడ్రేషన్‌లో ఉన్నారని లేదా మీకు కాలేయం, మూత్రపిండాలకు సంబంధించిన ఆరోగ్య సమస్య ఉందని అర్థం. కాబట్టి మూత్రం రంగు పసుపు రంగులో ఉన్నట్లయితే, మీ మూత్ర పిండాలు, కాలేయంపై శ్రద్ధ వహించాలి. మద్యం సేవించడం వంటివి చేయకూడదు. ప్రమాదం మరింతగా ముదిరినట్లు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

పసుపు రంగులో ఉంటే.. మూత్రం పసుపు రంగులో ఉంటే కామెర్లు ఉందని అర్థం. కాకపోతే శరీరంలో నీటి శాతం తక్కువగా ఉన్నా కూడా మూత్రం పసుపు రంగులో వస్తుంటుంది. ఒకవేళ మీరు పుష్టిగా నీరు తాగుతున్నా మూత్రం పసుపు రంగులో కనిపిస్తే మాత్రం కచ్చితంగా కామెర్లకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, వైద్యులను సంప్రదించి దానికి తగిన చికిత్స చేయించుకోవాలి. అలాగే మీ మూత్రం నారింజ లేదా ఆకుపచ్చ లేదా పసుపు రంగులో ఉంటే, కాలేయ ఆరోగ్య పరీక్ష చేయించుకోవడం మంచిది.

మూత్రం చాలా నురుగుగా ఉంటే

మూత్రంలో ప్రొటీన్ ఎక్కువగా వెళితే, మూత్రం నురుగుగా ఉంటుంది. మీరు మూత్ర విసర్జనకు వెళ్ళిన ప్రతిసారీ మీ మూత్రం నురుగుగా ఉంటే, మీకు కిడ్నీ లేదా మూత్రాశయ సమస్య ఉందని అర్థం. కాబట్టి మీరు దీన్ని కనుగొంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి. మూత్రం నలుపు రంగులో ఉంటే.. మీరు విసర్జించే మూత్రం నలుపు రంగులో ఉంటే.. మీ శరీరంలో రసాయనం ఉందని అర్థం. మీరు దీన్ని కనుగొంటే, ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. రంగు లేకపోతే? మూత్రంలో రంగు లేకపోతే మనం ఆరోగ్యంగా ఉన్నామని కాదు. మూత్రం ఏ రంగులో లేకపోతే మీకు మధుమేహం ఉందని అర్థం. మూత్రం రంగు తేలికగా ఉన్నా, తరచుగా మూత్ర విసర్జనకు వెళ్తున్నా మీకు మధుమేహం ఉందని అర్థం చేసుకోవాలి.

## అన్నంతో టమాటో పులావ్.



**టమాటో పులావ్ తయారీకి కావాల్సిన పదార్థాలు** -టమాటో -లవంగాలు -యాలకలు -షాజీరా -ఉల్లిపాయ -ఆయిల్ -నెయ్యి -ఉప్పు -కారం -గరం మసాలా -ధనియాల పొడి -బాస్మతి రైస్ లేదా మిగిలిపోయిన అన్నం

టమాటో పులావ్ తయారీ విధానం -ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి 2 టేబుల్ స్పూన్ల నెయ్యి, 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ పోసి వేడి చేయండి. -ఆయిల్ కొంచెం వేడెక్కిన తర్వాత అందులో ఒక ఇంచు దాల్చిన చెక్క, 2 లవంగాలు, 2 యాలకలు, అర టీస్పూన్ షాజీరా, ఒక ఉల్లిపాయ చీలికలు వేసి బంగారు గోధుమ రంగె వచ్చే వరకు వేపుకోండి. -తర్వాత అందులో 1 టీస్పూన్ అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి కలిపిన తర్వాత రెండు పెద్ద టమాటోల గుజ్జు వేయాలి. ఇందుకోసం టమాటోలను మిక్సీలో వేసి మెత్తని గుజ్జులా చేసుకోండి. దానిని పాన్ లో వేయాలి. -తర్వాత అందులో అర చెంచా ధనియాల పొడి, అర చెంచా గరం మసాలా,1 టీస్పూన్ కారం,రుచికి తగినంత ఉప్పు వేసి మొత్తం కలిసేలా కలిపి పచ్చి వాసన పోయి ఆయిల్ పైకి తేలేంతవరకు వేయించుకోండి. తర్వాత అందులో 3 టమాటోల ముక్కలు వేసి పచ్చి వాసన పోయేంతవరకు మగ్గించుకోండి. -తర్వాత కొద్దిసేపు నానబెట్టి వండిన బాస్మతి బియ్యం 1 కప్పు ఇందులో వేసి బాగా కలుపుకోండి. ఇంట్లో మిగిలిపోయిన అన్నం కూడా వేసుకోవచ్చు. రైస్ వేసి కలిపిన తర్వాత దాని మీద కొంచెం కొత్తిమీర చల్లుకొని స్టవ్ ఆఫ్ చేస్తే టేస్టీ టమాటో పులావ్ రెడీ.

## హైదరాబాదీ వెజ్ దమ్ బిర్యానీ..



**బిర్యానీ అంటే హైదరాబాద్..హైదరాబాద్ అంటే బిర్యానీ పేరు గుర్తుకువస్తది. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లి బిర్యానీ తిన్నా హైదరాబాద్ బిర్యానీ టేస్ట్ రాదు. అందుకే ఈ భూమ్మీద బిర్యానీ అత్యంత టేస్టీగా ఉండేది ఎక్కడ అంటే హైదరాబాద్ అని చెప్పేస్తారు ఏ దేశంలో అయినా. అంత ఫేమస్ మన బిర్యానీ. అయితే హైదరాబాద్ దమ్ బిర్యానీ రెస్టారెంట్లలో వచ్చే టేస్ట్ మాదిరి ఇంట్లో కూడా రెడీ చేసుకోవచ్చు. హైదరాబాద్ స్పెషల్ వెజ్ దమ్ బిర్యానీ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.**

హైదరాబాద్ స్పెషల్ వెజ్ దమ్ బిర్యానీ తయారీకి కావాల్సినవి -బాస్మతి బియ్యం -క్యారెట్ -బీన్స్ -బంగాళదుంప -పచ్చిమిర్చి -నెయ్యి -పచ్చి బఠానీ -ఫ్రైడ్ ఆనియన్ -పచ్చిమిర్చి చీలికలు.

-దాల్చిన చెక్క -యాలకలు -షాజీరా -బిర్యానీ ఆకు -లవంగాలు -అల్లం వెల్లుల్లి పేస్ట్ -కొత్తిమీర -పుదీనా -కారం -పసుపు -ఉప్పు -ధనియాల పొడి -వేయించిన జీలకర్ర పొడి -గరం మసాలా -నిమ్మకార రసం -పెరుగు -పచ్చి బఠానీ -కుంకుమ పువ్వు -వేడిపాలు -అనాస పువ్వు

హైదరాబాద్ స్పెషల్ వెజ్ దమ్ బిర్యానీ తయారీ విధానం -ముందుగా ఒకటిన్నర కప్పు అంటే 325 గ్రాముల బాస్మతి బియ్యంని గంట పాటు నానబెట్టుకోండి. -తర్వాత స్టవ్ ఆన్ చేసి బాండీ పెట్టి అందులో నీళ్లు పోసి బాగా మరిగించాలి. -మరుగుతున్న నీళ్లల్లో చెక్కు తీసిన 1 బంగాళదుంప ముక్కలు,6 ఫ్రెంచ్ బీన్స్, 1 క్యారెట్ ముక్కలు, క్యాలీఫ్లవర్ ముక్కలు కొన్ని, చిటికెడు పసుపు,కొంచెం ఉప్పు వేసి ఉడికించండి. -70 శాతం వరకు ఉడికిన తర్వాత అంటే 5 నిమిషాల్లో పూర్తిగా ఉడుకుతాయి అనుకున్నప్పుడు వీటన్నింటిని బాండీలోనుంచి ఓ బౌల్ లోకి తీసుకొని వాటిమీద కొన్ని చన్నీళ్లు పోసి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు అడుగు మందంగా ఉండే గిన్నెలో ఈ ఉడికించినవన్నీ వేసేయండి. ఇందులోనే అరగంట పాటు వేడి నీటిలో నానబెట్టిన పిడికెడు పచ్చి బఠానీ, పావు కప్పు ఫ్రైడ్ ఆనియన్,2 పచ్చిమిర్చి చీలికలు, 1 ఇంచు దాల్చిన చెక్క,5 యాలకలు, 1 టీస్పూన్ షాజీరా,1 బిర్యానీ ఆకు,4 లవంగాలు, 1 టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, 2 టేబుల్ స్పూన్ల కొత్తిమీర, 2 టేబుల్ స్పూన్ల పుదీనా,1 టేబుల్ స్పూన్ కారం, పావు చెంచా పసుపు,తగినంత ఉప్పు,1 టీస్పూన్ ధనియాల పొడి, 1 టీస్పూన్ వేయించిన జీలకర్ర పొడి, అర టీస్పూన్ గరం మసాలా,నిమ్మకార రసం కొంచెం వేసి అన్నీ కలిసేటట్లు బాగా కలపండి. -తర్వాత అందులోనే అరకప్పు మీగడతో ఉన్న పెరుగు వేసి కలిపి 2 టేబుల్ స్పూన్ల నెయ్యి, 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ వేసి కలిపి గిన్నెను పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు మరో పెద్ద గిన్నెను స్టవ్ మీద పెట్టి అందులో 2 లీటర్ల నీళ్లు పోసి అవి కొంచెం వేడయ్యాక అందులో 6 లవంగాలు, 6 దంచిన యాలకలు, 1 నల్ల యాలక, 1 టీస్పూన్ షాజీరా,1 బిర్యానీ ఆకు,1 అనాస పువ్వు,2 టేబుల్ స్పూన్ల అల్లంవెల్లుల్లి పేస్ట్,ఇందులో ఉండే ఉప్పే రైస్ కి పడుతుంది కాబట్టి సరిపడా ఉప్పు వేసి నీరుని తెర్లకాగనివ్వండి.

నీళ్లు తెర్లకాగుతున్నప్పుడు అందులో గంటపాటు నానబెట్టిన బాస్మతి బియ్యం వేసి ఇందులోనే 1 పచ్చిమిర్చి చీలిక, అర చెక్క నిమ్మరసం పిండుకోండి. -70 శాతం వరకు అంటే పట్టుకుంటే సగంపైన ఉడికి ఇంకా కొంచెం పలుకు ఉండేట్లు ఉన్నప్పుడు రైస్ ని కొద్ది తీసి మసాలలన్నీ కలిపి ఉంచిన వెజిటేబుల్స్ మీద రెండు లేయర్స్ గా వేసుకోండి. తర్వాత 80 శాతం వరకు ఉడికిన రైస్ ని మరో లేయర్ గా, 90 శాతం ఉడికిన రైస్ ని మరో లేయర్ గా వేజిటేబుల్స్ మీద వేసుకోవాలి. -ఇప్పుడు బిర్యానీ గిన్నె స్టవ్ మీద పెట్టి అందులో అంచుల వెంట రైస్ ఉడికించుకున్న నీళ్లు కొద్దిగా, 2 టేబుల్ స్పూన్ల నెయ్యి,వేడి పాలల్లో చిటికెడు నానబెట్టిన కుంకుమ పువ్వు,పవు చెంచా గరం మసాలా,2 టేబుల్ స్పూన్ వేయించిన ఆనియన్,1 టీస్పూన్ కొత్తిమీర చల్లి మూతపెట్టేసి 15 నిమిషాలు లో ఫ్లేమ్ మీద ఉడికించుకోండి. తర్వాత స్టవ్ ఆపేసి మరో 15 నిమిషాలు వదిలేసేయండి. -ఇంతే హైదరాబాదీ స్పెషల్ వెజ్ దమ్ బిర్యానీ రెడీ.



## చికెన్ టిక్కా ఇంట్లోనే..

**చికెన్ టిక్కా తయారీకి కావాల్సిన పదార్థాలు :** బోన్‌లెస్ చికెన్ పెరుగు కారం ఉప్పు పసుపు అల్లం వెల్లుల్లి పేస్ట్ గరం మసాలా నిమ్మరసం ధనియాల పొడి కసూరి మేథీ బిర్యానీ మసాలా మిరియాల పొడి శనగ పిండి నూనె చికెన్ టిక్కా తయారీ విధానం ఈ చికెన్ టిక్కాను ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. మ్యారినేట్ సరిగ్గా చేసుకుంటే ఇంట్లో చేసుకునే చికెన్ టిక్కా హెూటల్‌లో వాటికంటే మరింత రుచికరంగా ఉంటుంది. అలా చేసుకోవడానికి ముందుగా.. చికెన్‌ను శుభ్రంగా కడుక్కొని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో ఇప్పుడు పెరుగు, కారం, ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, నిమ్మరసం, ధనియాల పొడి, కసూరి మేథీ, శనగ పిండి, మిరియాల పొడి, బిర్యానీ మసాలా వేసుకోవాలి. ఇప్పుడు మనం వేసుకున్న మసాలాలు అన్నీ ఆ చికెన్‌కు పట్టుకునే విధంగా బాగా కలుపుకోవాలి. ఆ మసాలాలు మొత్తం చికెన్‌కు పట్టుకోవడానికి ఒక గంట పాటు మ్యారినేట్ చేసుకున్న చికెన్‌ను పక్కన పెట్టుకోవాలి. సాధారణంగా ఈ చికెన్ టిక్కాను కట్టెల పొయ్యి మీద చేసుకుంటేనే రుచి అద్భుతంగా ఉంటుంది. వీలైతే కట్టెల పొయ్యి మీదే చేసుకోవడానికి ప్రయత్నించండి. లేని యెడల గ్యాస్‌పైన కూడా చేసుకోవచ్చు. అలా ఒక గంట పాటు మ్యారినేట్ అయిన చికెన్‌ను తీసుకొని ఇనుప చువ్వల్లో గుచ్చుకోవాలి. ఆ తరువాత బొగ్గుల మంట మీద ఆ చికెన్ ముక్కలను రెండు వైపులా బాగా కాలే విధంగా నూనె పూసుకుంటూ కాల్చుకోవాలి. రెండు వైపులా సరిగ్గా కాలే వారకు కాల్చుకోవాలి. అప్పుడే ముక్క బాగా ఉడుకుతుంది. రుచి అద్భుతంగా ఉంటుంది.

# లోన్ రికవరీ ఆడగాలకు కళ్లెం

మొదటిపేజీ తరువాయి

విషయంలో రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్‌ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని పేర్కొం ది. ఒకవేళ ఆ మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్‌ను కొనుగోలు చేయడానికి సదరు బ్యాంకే లోన్ ఇచ్చి ఉంటే, అప్పుడు మాత్రమే ఫోన్ ఫీచర్లను నిలిపివేసే హక్కు బ్యాంకుకు ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టంచేసింది. అది కూడా సదరు లోన్ బకాయి పడి 90 రోజుల గడువు దాటి ఉండాలి. కస్టమర్‌లకు నోటీసులు ఇచ్చినా స్పందించని సందర్భాల్లోనే చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ.. ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయకూడదని పేర్కొంది. ఒకవేళ కస్టమర్ తన బకాయిని చెల్లిస్తే గంటలోనే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలి. ఆలస్యమైతే గంటకు రూ.250 చొప్పున బ్యాంకే తిరిగి రుణగ్రహీతకు పరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది. లోన్ రికవరీ కోసం బ్యాంక్ ఉద్యోగులు లేదా రికవరీ ఏజెంట్లు చేసే అన్ని కాల్స్ సమయం, నంబర్లను రికార్డ్ చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. అలాగే వారు చేసే ఆడియో, టెక్ట్స్ సంభాషణలను భద్రపరచాలని బ్యాంకులకు సూచించింది. రుణాల వసూళ్లలో లోన్ ఏజెంట్లు/ఉద్యోగులు అసభ్య పదజాలం, బెదిరింపులకు దిగడం వంటివి చేయకూడదని స్పష్టం చేసింది. కస్టమర్ల వ్యక్తిగత వివరాలు, ఆడియో/ వీడియో రికార్డులను సోషల్‌మీడియాలో పెట్టడం, సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్యకర సందేశాలు పంపడం, కాల్స్ చేసి పదేపదే వేధించడం వంటివి చేయకూడదని ఆర్‌బీఐ ప్రతిపాదించింది.

# ఎబోలా వైరస్ విజృంభణ

మొదటిపేజీ తరువాయి

తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎబోలా కారణంగా ఇప్పటివరకు 139 మంది మృతి చెందారు. దాదాపు 600 అనుమానిత కేసులను గుర్తించారు. కాంగోలో వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు తమకు మరింత సామగ్రి, సిబ్బంది అవసరమని అధికార వర్గాలు, సహాయక బృందాలు కోరాయి. మొదటి మరణం నమోదైన బునియా ప్రాంతానికి దాదాపు 20 టన్నుల సహాయ సామగ్రిని తరలించినప్పటికీ.. ఐసోలేషన్ గదుల కొరత కారణంగా వైద్యులు సాధారణ వార్డుల్లోనే ఎబోలా అనుమానిత రోగులకు చికిత్స అందిస్తున్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

మొదటిపేజీ తరువాయి

కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించనున్నారు.

# ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం. ఆది పుష్కరాల్లో నది స్నానం ఆచరించటం.. పితృతర్పణాలు ఇవ్వడం ఎలా ఫలితాలొస్తాయో.. అంత్య పుష్కర సమయంలోనూ ఆయా కార్యక్రమాలతో అవే ఫలితాలుంటాయని పండితులు చెబుతున్నారు.

# రామగుండం..అగ్నిగుండం

మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. ఈమేరకు పారిశ్రామిక ప్రాంతంలోని పలువురి మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపించడంతో హడలెత్తిపోయారు. మధ్యాహ్నం 12 గం.ల నుంచి 4 గం.ల వరకు ఎట్టి పరిస్థితిలోనూ బయటకు రావొద్దని హెచ్చరించింది. వీలైనంత వరకు ఇంటిలోనే ఉంటూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తాగాలని సూచిక జారీ చేసింది. ఐతే గత నాలుగు రోజులుగా రామగుండంలో ఊహించని స్థాయిలో ఎండలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతల భయానికి జనాలు ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. చుట్టూ వివిధ భారీ పరిశ్రమలు ఉండటంతో మిగతా ప్రాంతాల కంటే గోదావరిఖనిలో ఎండ దగడు ప్రమాద స్థాయిలో ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 25 నుంచి రోహిణీ కార్తె ఆరంభం కావడంతో అప్పటి పరిస్థితి తలచుకొని భయపడుతున్నారు.

# జాతీయ రహదారిపై కంటెయినర్‌లో మంటలు

మొదటిపేజీ తరువాయి

చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీలో కొత్తగా తరలిస్తున్న ఎనిమిది మారుతీ కార్లు ఉన్నాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించి కంటైనర్‌తో పాటు అన్ని కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు ఎగిసిపడటంతో జాతీయ రహదారిపై భయాందోళన వాతావరణం నెలకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొ చ్చారు. అగ్నిప్రమాదం కారణంగారహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భద్రతా చర్యల్లో భాగంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయం. అయితే కోట్ల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ లేదా సాంకేతిక లోపం వల్లే ఈ మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారి పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.





# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

మొదటిపేజీ తరువాయి

ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు-రామగుండం రైల్వే లైన్ కు ఆమోదం?

మొదటిపేజీ తరువాయి

గుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దాదాపు రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరు-రామగుండం మధ్య ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు, ఖనిజాలు, ఎరువులు, ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ తయారీ, భూసేకరణ, వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం, నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు. దీనికోసం రైల్వే శాఖ త్వరలోనే టెండర్లను ఆహ్వానించనుంది. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలావుంటే కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణలో రైల్వేప్రాజెక్టుల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ఎలక్ట్రిఫికేషన్ తదితర ప్రాజెక్టులపై మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణలోని 42 ప్రధాన రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి వివరంగా చర్చించారు. హైదరాబాద్ నగరంతో పాటుగా, చుట్టుపక్కల ప్రాంతాల ప్రయాణికులకు కీలకమైన రవాణా సౌకర్యంగా ఉన్న విషయంపై మాట్లాడారు. టైమింగ్స్ రెగ్యులరైజేషన్, సౌకర్యాలను మరింత మెరుగు పరిచేలా చొరవ తీసుకోవాలని తాను కోరానని.. దీనికి కేంద్ర రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తదనుగుణంగా ఎంఎంటిఎస్ మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకుంటామని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, హైస్పీడ్ రైల్ కారిడార్ పనుల పురోగతి తదితర అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో తెలంగాణలో రైల్వేల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తోందని వెల్లడించారు. రానున్న రోజుల్లోనూ రైల్వేనెట్‌వర్క్ పెంచడం, ప్రజలకు సౌకర్యాల అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

# ఎంజేపి బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

మొదటిపేజీ తరువాయి

పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల విద్యాసంస్థలు కారణాలు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలిని ఆయన అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందించడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మందలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం తో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయనీ తెలిపారు. గురుకుల పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం మీద విశ్వాసంతో ,అధ్యాపకుల విశ్వాసంతో తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తున్నారనీ తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా ఉపాధ్యాయుల తోనే పిల్లలు సమయం ఇస్తారని తమ సొంత పిల్లల మాదిరి విద్యార్థులను చూసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచైనా,చెడైనా అధ్యాపకులు దిక్సూచి అని తెలిపారు. 026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్థవంతంగా విజయాలు సాధించాలనీ ఆకాంక్షించారు. ఎవరిని ఇబ్బంది పెట్టి పని చేయించుకోవడం లేదనీ పూర్తి స్థాయిలో విద్యా బోధన జరగాలనీ ఆదేశించారు.ప్రైవేట్ భవనాల్లో నెల వారి అ÷-దదె కడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోతే కల్పించుకునే బాధ్యత ప్రిన్సిపల్ లది సూచించారు.టాయిలెట్స్, ఫ్యాన్స్,ఇతర మౌలిక సదుపాయాలు ఏం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ తెలిపారు.

# ఇన్‌ఫ్లుయర్లు సామాజిక బాధ్యతతో తీసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయాన్ని వైద్య, ఆరోగ్య, విద్యా రంగాల బలోపేతానికి, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. 'మన ప్రాంతాలను మనమే చూడకపోతే జీవితం సంపూర్ణం కాదు' అని పేర్కొన్న ఆయన.. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఆర్థిక స్థోమత అడ్డంకి కాదన్నారు. అనవసర ఖర్చులను తగ్గించుకుని కుటుంబంతో కలిసి పర్యాటక ప్రాంతాల్లో గడపడం వల్ల మానసిక ప్రశాంతత, ఆనందం లభిస్తాయని సూచించారు. దేశ, విదేశీ పర్యాటకులతో పాటు స్వరాష్ట్ర ప్రజలు కూడా తెలంగాణ పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా సందర్శించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత, కనీస వసతులు, ఆధునిక టెంట్ వసతి సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని తెలిపారు. వినియోగంలో లేని హరిత మోటళ్లు, పర్యాటక భూములను ఆదాయ వనరులుగా మార్చే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయర్లు కేవలం పర్యాటక ప్రమోషన్‌కే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి జూపల్లి సూచించారు. యువత.. గంజాయికి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు, బెట్టింగ్‌కు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటితో మానసిక రుగ్మతకు గురై బంగారు భవిష్యత్తును కొల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు ఇన్ఫ్లు యెన్సర్లు తమ కంటెంట్ ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రభాత భేరి అనే సరికొత్త సామాజిక చైతన్య కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించబోతుందని, లఘు చిత్రాలు, నాటికలు, రంగస్థల ప్రదర్శనలు, వివిధ కళా రూపాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యచరణను అమలు చేయబోతున్నామని ప్రకటించారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వం, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో క్రియేటర్లు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములయ్యే కంటెంట్ క్రియేటర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తెలంగాణను ప్రపంచ పర్యాటక మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే టూరిజం క్రియేటర్లకు ప్రభుత్వం తరఫున అవార్డులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ నూతన మెటా ఖాతా, అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. తెలంగాణ చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, హస్తకళలు, చేనేత, కలంకారీ కళా వైభవాన్ని ప్రతిబింబించే 'టైమ్‌లెస్ తెలంగాణ' వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, ఎండీ గౌతమి, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

మొదటిపేజీ తరువాయి

ఈ మరణ మృదంగ మేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలుచేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారు.ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్తనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు. ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి.అన్నదాతలు అడుగడుగడునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి పోయి కూడా లేదని తేలిపోయింది.కేసీఆర్ హయాంలో మూడు నెల ముందు నుంచే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేసే వారు. గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యేదాకా నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరికి టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం అన్నారు. 60 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు మరణశాసనం రాసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండని కెటిఆర్ తన లేఖలో కోరారు.

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

మొదటిపేజీ తరువాయి

వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు పక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ పక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు?. కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం. 'జనగణనలో కులగణన' విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలి' అని అన్నారు.

# పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలి

## జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 21 : ములుగు జిల్లా పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలని,లోకల్ టు గ్లోబల్‌గా ములుగు జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు.గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ములుగు జిల్లా టూరిజంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కాంపిటీషన్‌పై ఇన్‌ఫ్లుయెన్సర్లు,మీడియా ప్రతినిధులు,సోషల్ మీడియా హ్యాండ్లర్లతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. రీల్స్ కాంపిటీషన్ విధివిధానాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బహుమతుల వివరాలు తదితర అంశాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా మొదటిసారిగా వినూత్న పద్ధతిలో ములుగు జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలకు బ్రాండింగ్ కలిగించే విధంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4కె వీడియో క్వాలిటీతో రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని,ఆసక్తి కలవారు తమ వీడియోలను మే 21వ తేదీ నుంచి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని,ఆన్‌లైన్ విధానంలో డీపీఆర్ఓ రఫీక్ 99483 92976,ఏపీఆర్ఓ వేణు 9494970535 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు.పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన ప్రథమ బహుమతి రూ.21,000, ద్వితీయ బహుమతి రూ.15,000, తృతీయ బహుమతి రూ.10,000 అందించబడుతుందన్నారు. ములుగు జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు,ప్రకృతి పర్యాటక కేంద్రాలు,జలపాతాలు, అభయారణ్య అందాలు,గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కలగలిసి అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి వైవిధ్యభరితంగా నెలవై ఉన్నాయని పేర్కొన్నారు.జూన్ మాసం నుంచి పర్యాటక ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని,వారందరికీ ములుగు జిల్లా సాదర ఆహ్వానం పలుకుతుందన్నారు.రీల్స్ కాంపిటీషన్ ద్వారా ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలకు మంచి బ్రాండింగ్ వచ్చే విధంగా పూర్తి వివరాలతో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎం.డి. రఫీక్,ఈడీఎం దేవేందర్, మీడియా ప్రతినిధులు,సోషల్ మీడియా హ్యాండ్లర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా సాధన చేయాలి

## జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 21 : క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా సాధన చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు విద్యార్థులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం యువజన మరియు క్రీడల వారోత్సవాలలో భాగంగా, గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గల రెజ్లింగ్ సెంటర్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి 'ప్లే పార్టిసిపేట్ - స్పోర్ట్స్ డే'ను 'ఆడండి-పాల్గొనండి' అనే థీమ్‌తో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు,ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు అనంతరం 2026 సీఎం కప్ పోటీలలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను,విద్యార్థులను కలెక్టర్ అభినందించి ప్రశంసా పత్రాలు,పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,క్రీడలు యువతలో క్రమశిక్షణ,ఆరోగ్య చైతన్యం,జట్టు భావనతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.యువత క్రీడలను జీవితంలో భాగంగా చేసుకుని శారీరక,మానసిక దృఢత్వాన్ని సాధించాలని సూచించారు. నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని, విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.క్రీడా దినోత్సవంలో భాగంగా రెజ్లింగ్, కరాటే, ఖో-ఖో, కబడ్డీ,వాలీబాల్,అథ్లెటిక్స్ పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించగా, బాలురు,బాలికలు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం జిల్లా యువజన క్రీడల అధికారి బి.రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో పీఈటీలు,వివిధ క్రీడల కోచ్‌లు, క్రీడాకారులు,విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కృషి చేయాలి

## - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## - రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 21 : ఆధునిక భారత నిర్మాణ శిల్పి, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కంప్యూటర్ విప్లవానికి నాంది పలికి, సమాచార సాంకేతికత అభివృద్ధికి బాటలు వేసిన మహానేతగా ఆయన చిరస్మరణీయులని కొనియాడారు. గ్రామీణాభివృద్ధి, విద్య, యువత సాధికారత, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజీవ్ గాంధీ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. యువ భారతానికి కొత్త దిశను చూపిన నవ్య ఆధునిక ఆలోచనలతో దేశ అభివృద్ధికి కృషి చేసిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. అలాగే ఆయన ఆశయాలు, సేవా తత్వం నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. రాజీవ్ గాంధీ చూపిన మార్గంలో నడుస్తూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తరువాత జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

## - అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మే 21 : జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే జిల్లా యంత్రాంగం, రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ జాబితా సవరణకు సంబంధించిన వివిధ దశలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు తక్షణమే అన్ని నియోజకవర్గాలలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన వివిధ దశల షెడ్యూల్ వివరాలను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి తహసిల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనముగా జరిగిన రాజీవ్ గాంధీ వర్ధంతి

## భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించిన డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 21: జిల్లా పట్టణ కేంద్రంలోని నర్సంపేట బైపాస్ లో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి కార్యక్రమన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది . గురువారం జరిగిన ఈ కార్యక్రమం లో డిసిసి జిల్లా అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించినరు.

డిసిసి జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడని అన్నారు.రాజీవ్ గాంధీ వర్ధంతిని దేశవ్యాప్తంగా "ఉగ్రవాద వ్యతిరేక దినం"గా పాటిస్తున్న సందర్భంగా ప్రతి భారతీయుడు హింసకు వ్యతిరేకంగా, శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. "సమైక్యతే మన శక్తి - శాంతియుత భారతమే మన లక్ష్యం" అన్న దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని యువత రాజకీయలలో ముందు వుండాలని ఓటు హక్కు కల్పించడం రాజీవ్ గాంధీ అత్యంత గొప్ప నిర్ణయం, గ్రామీణఅభివృద్ధి కోసం పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, పట్టణాలఅభివృద్ధి పురపాలక చట్టాలను రూపకల్పనచేయడం మహిళలకి 33 % రిజర్వేషన్ ఆలోచనను ముందుకు తీసుకురావడం వంటి సంస్కరణలు ఆయన దూరదృష్టికి నిదర్శనం,సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహానుభావులు రాజీవ్ గాంధీ అని ఆయన సేవలని గుర్తించి ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించడం జరిగిందని అన్నారు.వారి ఆశయసాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం గా పని చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మహిళా నాయకురాలు, జిల్లా కాంగ్రెస్, పట్టణ, మైనార్టీ సెల్ , ఎస్టీ సెల్ , ఎస్సీ సెల్, ఓబీసీ సెల్ నాయకులు , కార్యకర్తలు, పాల్గొన్నారు.



# ప్రజల శ్రేయస్సు కోసం గాంధీ కుటుంబం జీవితాన్ని అంకితం చేసింది

## వనపర్తి జిల్లా డిసిసి చీఫ్ శివసేన రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 21 : దేశ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం గాంధీ కుటుంబం తమ జీవితాలను అంకితం చేసిందని వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేసిన మహానేత రాజీవ్ గాంధీ దేశ సాంకేతిక, టెలికాం, విద్యా రంగాల అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని కొనియాడారు. గురువారం రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ, 1984లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ దేశంలో సాంకేతిక రంగ అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. కంప్యూటర్ రంగం, టెలికమ్యూనికేషన్ వ్యవస్థల విస్తరణకు కృషి చేసి సమాచార సాంకేతిక విప్లవానికి పునాది వేశారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు టెలిఫోన్ సేవలను విస్తరించే దిశగా చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. విద్యా రంగంలో సంస్కరణలు తీసుకువచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేశారని, గ్రామీణ విద్యాభివృద్ధి కోసం నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. యువతకు అవకాశాలు పెంచే దిశగా అనేక విధాన నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. అలాగే దేశ పరిపాలనలో వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇస్తూ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపట్టారని అన్నారు. ఓటు హక్కు వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించే రాజ్యాంగ సవరణకు రాజీవ్ గాంధీ చేసిన కృషి వల్ల యువత రాజకీయాల్లో మరింత భాగస్వామ్యం అయ్యే అవకాశం లభించిందన్నారు. దేశాన్ని ఆధునిక భారతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు భారత అభివృద్ధి ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచాయని కొనియాడారు. సాంకేతికతను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లాలన్న ఆయన ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం యువత అభివృద్ధి, డిజిటల్ పురోగతి, క్రీడలు, ఉపాధి అవకాశాల కల్పనకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్ధన్ సాగర్, గంధం శరవంద, కోళ్ల వెంకటేష్, పలువురు కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పాండు సాగర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రైతు ప్రతి గింజ అమ్ముకునే వరకు తోడుగా ఉంటాం

## జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకాన్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (ఏటూరు నాగారం), మే 21 : జిల్లాలో రైతులు పండించిన ధాన్యపు గింజలు అమ్ముకునే వరకు తోడుగా జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటామని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ రైతులకు భరోసా కల్పించాడు.గురువారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వరి ధాన్యం తూకంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వెంటనే తమకు తెలియజేయాలని,వారి పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.పండించిన వరి ధాన్యాన్ని రవాణా చేయుటకు తగినన్ని వాహనాలను ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు.రైతులు పండించిన ప్రతి గింజను అమ్ముకునే వరకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని వారికి కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్,డిఎస్పి రవీందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శంకర్,సిఐ శ్రీనివాస్, ఎస్సై,పోలీస్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

## - బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 21 : ములుగు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలులలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. గురువారం బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం జిల్లా నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో తీవ్ర జాప్యం జరుగుతుండడం,మౌలిక వసతుల లేమి,తరుగు,తేమ, తాలు పేర్లతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న దోపిడీని వెంటనే అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆరుగాలం శ్రమించి కంటికి రెప్పలా పంటను పండించిన రైతన్నలు తమ పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలు,వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ వారాల తరబడి తిరుగుతూ ఎండాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు పండించిన పంట కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,రైతే రాజు అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలలో తక్షణమే కాంటాలు, గన్నీ బ్యాగులు,హమాలీలు, లారీలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి రైతులు తీసుకొచ్చిన ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేయాలని,తరుగు,తేమ,తాలు పేర్లతో రైతులను ఇబ్బంది పెడుతూ కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడుతున్న అధికారులు,దళారులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని,అకాల వర్షాల వలన పంట తడిసి పోకుండా కొనుగోలు కేంద్రాలలో తగినన్ని టార్పాలిన్ పరదాలు ఏర్పాటు చేసి రైతులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని,ధాన్యం లిఫ్టింగ్ చేసిన వెంటనే ఆలస్యం చేయకుండా రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని, మొక్కజొన్న కొనుగోలు విషయంలో పంట నమోదు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా,ప్రైవేట్ దళారుల వద్ద తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి రాకుండా ప్రభుత్వం మద్దతు ధరకు ప్రతి గింజను కొనుగోలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రైతుల పక్షాన బిజెపి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు చింతలపూడి భాస్కర్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జవహర్ లాల్,జిల్లా ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవింద్రాచారి, ములుగు మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు,పట్టణ అధ్యక్షులు ఇమ్మడి రాకేష్ యాదవ్,గాదంకుమార్,రవి రెడ్డి,చుంచు రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పదవికి నాగారం శంకర్ దరఖాస్తు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




యాదాద్రి భువనగిరి, మే 21 : సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పదవికి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూ వివేరా హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం శంకర్ ఎస్సీ విభాగం జిల్లా చైర్మన్ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దీవవతీశ్రీఖ ×శ్రీఖఋష్త్ర, ఉమ్మడి జిల్లా పరిశీలకుడు మందుల సూర్యకిరణ్‌లను కలిసి దరఖాస్తు పత్రాలను అందజేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టడం మంచి పరిణామమని, ఇది పార్టీ నూతన విధానాలకు నిదర్శనమని నాగారం శంకర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ ధీఖతీతీవ జీఖష్త్రఖఅస్త్రఱతీ, పీసీసీ కార్యదర్శి ఫోత్నాక్ ప్రమోద్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు దర్గా హరిప్రసాద్, మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ పులిగిల్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com